ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 14 ఆగస్టు 2025

వీఆర్వోల బదిలీలలు

- అయిదేళ్లయినా ఒకేచోటే పోస్టింగ్
- సొంత మండలంలోనే ఉద్యోగం
- వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2 బదిలీలు అస్తవ్యస్తం

జిల్లాలో ఇటీవల జరిగిన వీఆర్వోల బదిలీల్లో వింతలు, విశేషాలు చోటు చేసుకున్నాయి. అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో అన్న చందంగా వ్యవహరించారు. ఎప్పుడో మేలో మొదలైన బదిలీల ప్రక్రియ చివరకు మూడు నెలల తర్వాత కార్యరూపం దాల్చినా అది కూడా అస్తవ్యస్తంగా జరిగిందనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు పక్కన పెట్టి అయిన వారిని అందలమెక్కించారని పలువురు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ఒక ఉద్యోగిని బదిలీ చేయాలంటే ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం, సొంత మండలం, గతంలో పనిచేసిన గ్రామం, తదితర వివరాలతో కూడిన ప్రొఫార్మాలో వివరాలు తీసుకుని ఆ మేరకు పోస్టింగ్ ఇస్తారు. కానీ ఇక్కడ మాత్రం అవేమీ పట్టించుకోకుండా 'మనోడే' అన్నట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

మదనపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మదనపల్లె చాలా కీలకమైన ప్రాంతం. ఇక్కడి భూములు విలువైనవే కాదు.. ఇక్కడ భూకబ్జాలు, ఆక్రమణలు, ఫోర్జరీ రికార్డులతో స్వాధీనం చేసుకునే రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు ఎక్కువగా ఉన్నారు. కీలకమైన రెవెన్యూ సిబ్బంది, అధికారులే వీరికి ప్రత్యక్ష, పరోక్షకారులు. ఈ క్రమంలో అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో వీరంతా కలసి పనిచేసినవారే. ఇందులో భాగంగా తమకు కావాల్సిన రెవెన్యూ సిబ్బందిని కావాల్సిన గ్రామానికి డిప్యుటేషన్‌పై వేయించుకోవడం, కావాల్సిన ఫైలు, నివేదిక, 22ఏ ఎన్‌వోసీకి సిద్ధం అయ్యాక తిరిగి వారిని మరో గ్రామానికి మార్పు చేసిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా బీకే పల్లె, బసినికొండ, వలసపల్లె, కోళ్లబైలు రెవెన్యూ గ్రామాల్లో ఇలాంటివి ఎక్కువగా జరిగాయి. అడ్డదారుల్లో ఎన్‌వోసీలు కూడా జారీ చేశారు. చివరకు భూఅక్రమాలు, రెవెన్యూ రికార్డులు కనుమరుగు చేసే క్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రికార్డుల దహనానికే పాల్పడిన విషయం తెలిసిందే. అయినా రెవెన్యూ అధికారుల్లో మార్పు కనిపించనట్లుంది.

జిల్లాలో గ్రేడ్-1లో 45 మంది వీఆర్వోలు, గ్రేడ్-2లో 34 వీఆర్వోలను ఇటీవల బదిలీ చేశారు. ఇందులో ఎక్కువగా జిల్లా కేంద్రం రాయచోటి, రాజంపేట, మదనపల్లె, తదితర మండలాలు ఉన్నాయి. మదనపల్లె మున్సిపాలిటీ, మండలంలో పనిచేసిన వీఆర్వోలు ప్రవీణ్‌కుమార్, బి.మునుస్వామి నాయక్, కళ్యాణిలు గ్రేడ్-2 విభాగానికి సంబధించిన వారు. ఉద్యోగం వచ్చిన అయిదారేళ్ల నుంచి వీరు మదనపల్లె పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేశారు. తాజా బదిలీలలోనూ వీరికి గ్రామాన్ని మార్చారే కానీ..మండలాన్ని దాటనీయలేదు. అలాగే గ్రేడ్-1 వీఆర్వోలు ఎం.నరేంద్రరెడ్డి, నారాయణతో పాటు మరో ఇద్దరు మహిళా వీఆర్వోలకు సొంత మండలంలోనే పోస్టింగ్ ఇచ్చారు. అలాగే బి.కొత్తకోట మండలంలో పనిచేసిన నరేంద్రను తిరిగి బి.కొత్తకోట వీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. కురబలకోట మండలం ముదివేడు-1లో పనిచేసిన ప్రతిమను తిరిగి సొంత మండలంలోని ముదివేడు-2 వీఆర్వోగా బదిలీ చేశారు. ఇవి మచ్చుకు మాత్రమే జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి.

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనంలో ఎక్కువ ఎన్‌వోసీలు జారీ అయిన వలసపల్లె, బీకే పల్లె గ్రామంలో గ్రేడ్-2 వీఆర్వో కళ్యాణి, ప్రవీణ్‌కుమార్, మునుస్వామినాయక్‌లు ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన వీఆర్వోలు సీఐడీ విచారణకు కూడా హాజరవుతున్నారు. మరోవైపు ప్రస్తుతం కలికిరి మండలంలో పనిచేస్తున్న గ్రేడ్-1 వీఆర్వో నరేంద్రరెడ్డిని కోళ్లబైలు రెవెన్యూ గ్రామానికి బదిలీ చేశారు. అలాగే పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న బి.మునుస్వామి నాయక్‌ను సొంత మండలమే కాదు..స్వగ్రామం కోటవారిపల్లెకు బదిలీ చేశారు. నరేంద్రరెడ్డి, మునుస్వామినాయక్‌లు ఇద్దరూ సొంత ప్రాంతాలు అంటూ జాయిన్ కాలేదని చెబుతున్నారు. అలాగే బి.కొత్తకోట నుంచి గ్రేడ్-1 వీఆర్వో జె.మల్లికార్జున కూడా కోళ్లబైలుకు బదిలీ చేశారు. అయితే ఆయన కూడా కోళ్లబైలులో చేరడానికి నిరాకరిస్తున్నారు. బొమ్మనచెరువులో వీఆర్వోగా పనిచేస్తున్న సౌజన్యను కోళ్లబైలు గ్రామానికి డిప్యుటేషన్ వేశారు. అయితే కోళ్లబైలుకు ఎవరూ రాని కారణంగా ఆమెను రిలీవ్ చేయలేదు. ఈమె స్థానంలో బొమ్మనచెరువులో కొత్తవారిపల్లె-2 వీఆర్వో వసంతకుమారి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. అలాగే అంకిశెట్టిపల్లె వీఆర్వో సంధ్యను ఇదివరకే పొన్నేటిపాళెం గ్రామానికి ఇన్‌చార్జ్‌గా నియమించగా, ప్రస్తుతం బదిలీల్లోనూ అక్కడికే రెగ్యులర్ పోస్టింగ్ ఇచ్చారు.

బదిలీ అయిన వీఆర్వోలు ప్రవీణ్‌కుమార్, మాధవరెడ్డిని రిలీవ్ చేయకపోవడంతో వీరు ఇక్కడే ఉండేలా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రవీణ్‌కుమార్‌ది సొంత మండలంతోపాటు ఉద్యోగం వచ్చినప్పటి నుంచీ ఇక్కడే పనిచేస్తున్నారు. ఇదివరకే నిమ్మనపల్లె నుంచి మదనపల్లె మండలం వలసపల్లెకు డిప్యుటేషన్‌పై వచ్చిన వీఆర్వో నాగేశ్వరరావు సెలవులో వెళ్లగా, తిరిగి ఇప్పటి బదిలీల్లో ఆయనకు వలసపల్లె గ్రామం ఇచ్చారు. ఇలా కీలకమైన బసినికొండ, కోళ్లబైలు, బి.కె.పల్లె, సీటీఎం గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేకుండాపోయారు. వీరి స్థానంలో ఇన్‌చార్జులుగా గ్రేడ్-2లతో కాలం గడుపుతున్నారు.


మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం



సొంత మండలం ఎవరికీ ఇవ్వలేదు

వీఆర్వోల బదిలీల్లో సొంత మండలాల్లో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. అలాంటివి ఏమైనా ఉంటే మీరే చెప్పండి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉన్నవాళ్లు అలాగే ఉంటారు. కొత్తగా బదిలీ చేసే వాళ్లకు మాత్రమే సొంత మండలం వర్తిస్తుంది. బదిలీ చేసిన అందరినీ రిలీవ్ చేయమని తహసీల్దార్లకు చెప్పాం. అలా ఎక్కడైనా చేయకుండా ఉంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

-మధుసూదన్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి

బదిలీలతో నాకు సంబంధం లేదు

వీఆర్వోల బదిలీలు, పోస్టింగుల్లో నాకు సంబంధం లేదు. అదంతా కలెక్టర్ ఆదేశాలు. అడిగిన వారిని రిలీవ్ చేశాం. రిలీవ్‌లో నా సొంత అజెండా అంటూ ఏమీ లేదు. పై అధికారులు ఆపమంటే ఆపాం. మళ్లీ వాటిల్లో మార్పులు ఉన్నాయని చెప్పారు. మార్పులు, చేర్పులు దగ్గర్లోనే జరగొచ్చు.

- కిశోర్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్, మదనపల్లె.



పీలేరు నీటి వనరులకు జలకళ

- మొరవపోతున్న బాలంవారిపల్లె గార్గేయ ప్రాజెక్టు

పీలేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంతో పాటు పొరుగున ఉన్న చిత్తూరు జిల్లా సదుం, సోమల మండలాల్లో కురుస్తున్న వర్షాలకు పీలేరు నీటి వనరులకు జలకళ సంతరించుకుంది. పీలేరు పట్టణ దాహార్తి తీర్చేందుకు ప్రధాన నీటి వనరు అయిన బాలంవారిపల్లె వద్ద ఉన్న గార్గేయ ప్రాజెక్టు బుధవారం ఉదయం నుంచి మొరవపోతుండడంతో దాని దిగువన ఉన్న బాలంవారిపల్లె, దొడ్డిపల్లె, పీలేరు ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న చిత్తూరు జిల్లా సదుం మండలంలోని కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు మొరవ పోయి గార్గేయ నది గూండా గార్గేయ ప్రాజెక్టులోకి పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో ఆ ప్రాజెక్టు మొరవ పోయి ఆ నీరు పింఛా నదిలోకి ప్రవహిస్తోంది. పింఛా నది ద్వారా కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ దారి తీసే కాలువల్లోకి నీరు చేరి వాటిలో ప్రవాహం పెరిగింది. కలికిరి మండలంలో కురిసిన వర్షాలకు మదనపల్లె మార్గంలోని బడబండ్ల వంకలోనూ ప్రవాహం పెరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్న చిన్న నీటి కుంటలు, చెరువుల్లోనూ గణనీయంగా నీరు పెరిగింది. బుధవారం ఉదయం నుంచి పీలేరు పరిసరాల్లోని పింఛా నదిలోనూ నీటి ప్రవాహం పెరిగింది.


కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

బొప్పాయి ధరలపై ఫిర్యాదుకు హెల్ప్‌లైన్

రైల్వేకోడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ భావన మాట్లాడుతూ దళారులు బొప్పాయి ధరలను తగ్గిస్తే తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్లు నెంబర్లు 95739 90331, 90303 15951కు రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. టన్ను కాయలను రూ.9 వేలకు తక్కువ కాకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలన్న కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించరాదన్నారు. ఈ హెల్ప్‌లైన్ నెంబర్లు ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పనిచేస్తాయన్నారు. ఫిర్యాదు చేసేప్పుడు రైతు పేరు, గ్రామం పేరు, సర్వే నెంబరు, చిరునామా, ట్రేడర్ పేరు, ధర, వాహనం నెంబరు తప్పనిసరిగా హెల్ప్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'అన్నమయ్య'లోకి పుంగనూరు

- మదనపల్లె రెండు మండలాలు.. కొత్తగా అర్బన్
- మంత్రివర్గ ఉపసంఘానికి ప్రతిపాదనలు

రాయచోటి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు మంత్రివర్గ ఉప సంఘానికి ప్రతిపాదనలు అందాయి. గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా జిల్లాల ఏర్పాటులో రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డగోలుగా జిల్లాలను విభజించిందని ఆరోపణలు వచ్చాయి. ఎన్నో నియోజకవర్గాలను, మండలాలను ప్రజల సౌకర్యంతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చినట్లు జిల్లాల్లో కలిపారు. వీటిపై అప్పట్లో ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకతలు వచ్చినా వాటిని అప్పటి జగన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. గత ఎన్నికల సందర్భంగా జిల్లాల ఏర్పాటులో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. బుధవారం సబ్ కమిటీ విజయవాడలో సమావేశమై వీటిపై చర్చించింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గం రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉంది. ఈ లెక్కన పుంగనూరు అన్నమయ్య జిల్లాలో ఉండాల్సి ఉంది. అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాపై తన పట్టు నిలుపుకునేందుకు పుంగనూరును చిత్తూరు జిల్లాలోనే ఉంచారని ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపాలని మంత్రివర్గ ఉపసంఘానికి ప్రతిపాదనలు అందాయి. అదేవిధంగా ప్రస్తుతం మదనపల్లె మండలాన్ని అదనంగా అర్బన్ మండలంగా విభజించనున్నారు. ఈ మేరకు మంత్రి వర్గ ఉపసంఘానికి ప్రతిపాదనలు అందాయి.

ఆత్మలు 'ఉపాధి' పనులు చేశాయి...
- చనిపోయిన వ్యక్తుల పేరిట బిల్లులు
6

ఆధునిక బోధనా పద్ధతులు తప్పనిసరి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సెంటర్లలో ఈసీసీ (ఎర్లీ చైల్డ్ కేర్) కార్యక్రమాల ద్వారా పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించడం అత్యావసరమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి అంగన్వాడీ సెంటర్లలో ఈసీసీ సమర్థవంతమైన కార్యకలాపాలపైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఈసీసీ కార్యకలాపాలు పిల్లల మానసిక, శారీరక, భాషా, సామాజిక అభివృద్ధికి అత్యవసరమని, పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. మారుతున్న తరానికి అనుగుణంగా ఆధారిత (బేస్డ్) కార్యకలాపాలను దత్తత తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలోని 2,275 అంగన్వాడీ కేంద్రాల్లో 35,248 మంది పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందిస్తున్నామని వివరించారు. ఇటీవల తాను తంబళ్లపల్లెలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించానని, అక్కడ మూవబుల్ గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తల వద్ద ఉన్న పాత మొబైల్ ఫోన్లను అప్‌గ్రేడ్ చేసి వీడియో కంటెంట్, ప్లేబ్యాక్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

విచారించి బాధితులకు న్యాయం చేస్తాం

- సబ్ కలెక్టర్ భావన

పుల్లంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ భావన తెలిపారు. బుధవారం ఆమె పుల్లంపేట రెవెన్యూ సమస్యలపై స్పెషల్ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి స్వయంగా బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అందరికీ కచ్చితంగా పరిష్కారం చూపుతామన్నారు. భూసమస్యలకు సంబంధించి 30, సర్వేకు సంబంధించి 7, సివిల్ సప్లైకి సంబంధించిన 2 అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం ఆమె ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి ఎంపీడీవో జయశ్రీతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు పుల్లారెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ భావన

నేడే కౌంటింగ్

- పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు
- ఉదయం 8 నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ
- కౌంటింగ్‌కు వైసీపీ బాయ్‌కాట్

కడప/ఒంటిమిట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఎదురు చూస్తున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల ఫలితాలు గురువారం వెల్లడి కానున్నాయి. అసెంబ్లీ ఎన్నికలను తలదన్నే విధంగా ఈ ఎన్నికలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠతగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పులివెందుల ఉప ఎన్నికల్లో గెలుపుపై ఆసక్తిగా చూస్తున్నారు. ఇక్కడ గెలుపు దాదాపు ఖరారైనప్పటికీ అధికారిక ఫలితం కోసం ఎదురు చూస్తున్నారు. కడప నగర శివారులోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఓట్లలెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. పులివెందులకు సంబంధించి ఒక రౌండులో పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టకు సంబంధించి మూడు రౌండ్లు, పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబులుకు ఒక సూపర్‌వైజరు, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. మొత్తం సుమారు వంద మంది సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొననున్నారు. కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్‌లు కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

వైసీపీ బాయ్‌కాట్

జడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్‌ను వైసీపీ బాయ్‌కాట్ చేయనున్నట్లు చెబుతున్నారు. జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్యంగా జరగలేదంటూ ఇప్పటికి వైసీపీ ఆరోపిస్తూ వస్తుంది. కౌంటింగ్‌ను కూడా బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఒంటిమిట్ట వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి కౌంటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. పులివెందులలో జరిగిన రీ పోలింగ్‌ను వైసీపీ బహిష్కరించింది. అయితే కౌంటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు అధికారికంగా ఆ పార్టీ ప్రకటించ లేదు.

గెలుపుపై ఇరుపార్టీల ధీమా

ఒంటిమిట్ట మండలంలో పోలింగ్ శాతం బాగా పెరగడంతో గెలుపుపై ఇరుపార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ 3 వేల నుంచి 5 వేల లోపు మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమాగా చెబుతున్నారు. వైసీపీ నాయకులు కూడా 1500 నుంచి 2 వేల లోపు మెజారిటీతో విజయం సాధిస్తామని చెబుతున్నారు. ఒంటిమిట్టలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. 13 నెలల్లో చేసిన అభివృద్ధి పనులు చూసి తమకే ప్రజలు ఓటు వేశారని, భారీ మెజార్టీతో తాము విజయం సాధిస్తామని తెలుగుదేశం పార్టీ వారు చెబుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యమందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి, మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ రైతుల నుంచి పీజీఆర్ఎస్ వినతులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, కార్యాలయాల చుట్టూ రైతులను తిప్పుకుంటున్నారని, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆమె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే ఓపీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని మందుల స్టాకు వివరాలు, పేషంట్ల వివరాలు, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను డాక్టర్ మహ్మద్ ఎస్దానీని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలోకి 24 సచివాలయాలను విలీనం చేశారని తగినంత సిబ్బంది లేకపోవడంతో పని భారం అధికమవుతోందని, ఆసుపత్రిలో నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, సిబ్బందితో పాటు నైట్ వాచ్‌మన్‌ను నియమించాలని సిబ్బంది సబ్ కలెక్టర్‌ను కోరారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. పిల్లల ఆరోగ్యం, మధ్యాహ్న భోజనం, గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుతో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌తో పాటు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమారి, టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లెలో మహిళల భారీ ర్యాలీ

- స్వాతంత్ర్య వేడుకల సంరంభంలో అడుగులు కలిపిన అతివలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మదనపల్లెలో మహిళలు అడుగులు కలిపి కదం తొక్కారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మిషన్ కాంపౌండు నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు మహిళలు జాతీయ జెండా పట్టుకుని నినాదాలు చేస్తూ పదం కలిపారు. ర్యాలీ ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హోంరూల్ ఉద్యమంలో ఐరిష్ మహిళ అనిబిసెంట్ మదనపల్లె నుంచి విస్తృతంగా పాల్గొన్నారని, ఆమె స్ఫూర్తితో ఎందరో మహిళామణులు స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్నారన్నారు. అలాంటి మదనపల్లెలో మూడు రోజులు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవం సంబరాలు నిర్వహిస్తున్నామని, ఇందులో వేలాది మంది మహిళలు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మదనపల్లె చరిత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మహిళలు, బాలికలు నడిచే ర్యాలీ పట్టణ ప్రజలకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ర్యాలీలో నాలుగు గుర్రాలు ముందు వరుసలో నడుస్తూ ఆకర్షణగా నిలిచాయి. ఓ గుర్రం పైకి ఎక్కిన ఎమ్మెల్యే కొద్దిసేపు స్వారీ చేశారు. మెప్మా సంఘాలు, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


చేతిలో జాతీయ పతాకాన్ని పట్టుకుని గుర్రం మీద స్వారీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


ర్యాలీలో భారీ సంఖ్యలో మహిళలు

రౌద్రాల అంకాళమ్మ ఆలయ చైర్మన్‌గా కోడి రామకృష్ణారెడ్డి


కోడి రామకృష్ణారెడ్డి

పీలేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ దేవత అయిన రౌద్రాల అంకాళమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు విశ్రాంత మేనేజర్ కోడి రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. తనతో పాటు మరో 9 మందిని ప్రభుత్వం సభ్యులుగా నియమించిందని, త్వరలోనే తాము ప్రమాణస్వీకారం చేస్తామని ఆయన తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


రామచంద్రరాజు(ఫైల్)

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదవరంపోడు పంచాయతీ పరిధి ప్రధాన జాతీయ రహదారి వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉపాధ్యాయుడు రామచంద్రరాజు (60) మృతి చెందాడు. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ వివరాల మేరకు... కోడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరాజు మంగళవారం అర్ధరాత్రి ఆటోలో కోడూరు నుంచి మాధవరంపోడు గ్రామానికి చేరుకుని రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు వెంటనే స్థానికులు కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య మాధవరంపోడులో అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది.

మహిళ మృతిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఆమె తండ్రి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ టి. సదుం పంచాయతీ రామాపురం వాసి వెంకటరమణ కుమార్తె మలిశెట్టి రత్నమ్మ (30) మదనపల్లెలోని మెడికల్ షాపులో పనిచేస్తుండేది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లికు చెందిన బాల్లాపురం జ్యోతిశేఖర్ ఆమెను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు మునిష్కరనందన్ (2) ఉన్నాడు. అయితే భర్త పెయింటింగ్ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి రత్నమ్మ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. దీంతో తండ్రి వెంకటరమణ ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశామన్నారు.

ఇళ్లను త్వరగా పూర్తి చేయండి


ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్

నిమ్మనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్ వున్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి సతీశ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక దండువారిపల్లిలో ఉన్న లేఅవుట్‌ను ఎంపీడీవో రమేశ్‌తో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు సరైన సమయానికి నిర్మించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అదనంగా డబ్బు మంజూరు చేసినా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేక పోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారుల్లో చైతన్యం తెచ్చి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పనులు సక్రమంగా చేయని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆత్మలు 'ఉపాధి' పనులు చేశాయి...!

- చనిపోయిన వ్యక్తుల పేరిట బిల్లులు
- టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సస్పెన్షన్
- గోకులం బిల్లుకు రూ.10 వేలు లంచం
- దొంగ మస్టర్లతో బిల్లులు స్వాహా
- సామాజిక తనిఖీలో వెలుగులోకి...

గుర్రంకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల ఆత్మలు వచ్చి గుర్రంకొండ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనులు చేశాయి. ఈ ఆత్మలు కూడా వారం రోజుల పాటు ఉపాధి పథకంలో వంక పనులు, చెరువులో పూడికతీత పనులు, పండ్ల తోటల పనులు చేయడం విశేషం. గ్రామాల్లో పాడి రైతుల కోసం నిర్మించిన గోకులాల్లో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీ బృందం బహిరంగ సభలో వెల్లడించింది. అంతేకుండా గోకులం షెడ్‌కు బిల్లు మంజూరు చేయాలంటే రూ.10 వేలు లంచం ఇచ్చినట్లు టీడీపీ సీనియర్ నేత జిల్లా అధికారులకు సమావేశంలో ఫిర్యాదు చేయడం ఉపాధి సిబ్బంది అవినీతి, అక్రమాలకు నిదర్శనంగా మారింది. అలాగే ఉపాధి పనుల్లో కూలీలు పనులు చేయకనే బినామీ పేర్లతో బిల్లులను డ్రా చేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. అంతేకాకుండా దొంగ మస్టర్లతో పలు గ్రామాల్లో బిల్లులు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది.

గుర్రంకొండ మండలంలోని ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులు చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ.5.50 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులతో రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం, పూడికతీత పనులు, చెరువుల్లో పూడికతీత పనులు, వంక పనులు, ట్రెంచ్ పనులు, సీసీ రోడ్లు, గోకులం షెడ్లను నిర్మించారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందం పది రోజులపాటు గ్రామాల్లో తిరిగి ప్రతి పనిని తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడించారు. ఇందులో భాగంగా మండలంలోని సరిమడుగు పంచాయతీలో ఉపాధి హామీ పనులను రెండేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులు చేసినట్లు చూపి బిల్లులను డ్రా చేశారు. గ్రామానికి చెందిన చిన్నరమణ 2023వ సంవత్సరం, రెడ్డెమ్మ 2021లో చనిపోయారు. వీరిద్దరూ ఉపాధి హామి పథకంలో 2024వ సంవత్సరంలో పనులు చేసినట్లు చూపి బిల్లులను డ్రా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అలాగే శెట్టివారిపల్లె పంచాయితీలో నిర్మించిన రెండు గోకులాలు బినామీ పేర్లతో నిర్మించినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించడంతో బినామీలకు, రైతులకు వాగ్వాదం జరిగింది. దీంతో రెండు గోకులాల నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీడీ మధుబాబును పీడీ ఆదేశించారు. అలాగే టి.రాచపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ సింగిల్ విండ్ చైర్మన్ మహాత్మారెడ్డి తన భార్య పేరిట గోకులం షెడ్ మంజూరైతే బిల్లు చేయడానికి టీఏ మదన్‌మోహన్‌రాజుకు రూ.10 వేలు లంచం ఇచ్చినట్లు పీడీకి ఫిర్యాదు చేశాడు. అలాగే మర్రిపాడు, రామాపురం, ఎల్లుట్ల, సరిమడుగు. చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో దొంగ మస్టర్లను వేసి బిల్లులు డ్రా చేసినట్లు తనిఖీ బృందం తెలిపింది. అలాగే గుర్రంకొండ పంచాయతీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పనులు చేసినట్లు చూపి నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. గుర్రంకొండ, టి.పసలవాండ్లపల్లెలో హౌసింగ్ బిల్లులను లబ్ధిదారుల పేరిట కాకుండా బినామీ వ్యక్తుల ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ గ్రామాల్లో జరిగిన చెరువులకు నీరు చేరే వంక పనుల్లో పని పరిమాణం తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే పలు గ్రామాల్లో ఏపీవో జయరామిరెడ్డి మస్టర్లను తనిఖీ చేయకపోవడంతో అవినీతి, అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందం తెలిపింది.


గోకులాల నిర్మాణాల్లో అక్రమాలను వెల్లడిస్తున్న డీఆర్పీ మణికంఠ

ఇద్దరు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

గుర్రంకొండ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. సరిమడుగు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పూజిత, టెక్నికల్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రాజులను సస్పెండ్ చేసినట్లు పీడీ తెలిపారు. అలాగే వివిధ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాల నుంచి రూ.7 వేలు రికవరీ చేయగా 8 వర్క్ ఐడీలో జరిగిన పనులపై విచారణ చేయాలని ఏపీడీ మధుబాబును ఆదేశించారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.2,39,372 లక్షలు అవినీతి జరిగినట్లు పీడీ తెలిపారు.

కాటమరాజు స్థల పట్టా రద్దు చేయండి

- స్థలాన్ని గుడి ఉత్సవానికి కేటాయించండి: కలెక్టర్ శ్రీధర్


కాటమరాజు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

గాలివీడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాటమరాజు ఉత్సవానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి పట్టాను రద్దు చేసి తిరిగి గుడి ఉత్సవాలకే కేటాయించాలని తహసీల్దార్ భాగ్యలతను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లెకు సమీపంలో గత కొన్ని వందల సంవత్సరాలుగా సంక్రాంతి నాడు చిట్లాకుప్ప వేసుకునే కాటమరాజు ఉత్సవ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తి డీకేటీ పట్టా చేయించుకుని దాని చుట్టూ కంచె వేసిన విషయాన్ని ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కలెక్టర్‌తో మాట్లాడుతూ మా ఊరు పుట్టినప్పటి నుంచి ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ రోజు అంగరంగ వైభవంగా కాటమరాజు ఉత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఈ స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తెలియకుండా డీకేటా పట్టా చేయించుకుని ఉత్సవం జరుపుకోవడానికి కూడా అవకాశం లేకుండా చుట్టూ కంచె వేశాడని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కాటమరాజు స్థలాన్ని ఆక్రమించుకున్న కుటుంబ సభ్యులకు ఎన్ని ఎకరాల వరకు డీకేటీ పట్టా ఉంది, ఎంతమంది పేర్ల మీద డీకేటీ ఉన్నది అనే విషయాన్ని పరిశీలించి వెంటనే పట్టా రద్దు చేయడానికి తగిన ప్రతిపాదనలు తమకు పంపాలని తహసీల్దార్‌కు తెలిపారు. ఎక్కడ కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కాటమరాజు స్థల వివాదానికి సంబంధించి తమ దృష్టికి వచ్చిందని, తాను ఇరుపక్షాలతో మాట్లాడి ఉత్సవాన్ని జరుపుకోవడానికి స్థలం ఇవ్వాలని తాను కూడా వారికి తెలియజేసినట్లు తహసీల్దార్ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు పదేళ్ల జైలుశిక్ష

- రాజంపేట మూడవ ఏడీజే కోర్టు తీర్పు


నందలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వరకట్న మరణం కేసులో ముద్దాయి పామూరు సాయివర్ధన్‌కు రాజంపేట మూడవ ఏడీజే కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ 10 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నందలూరులోని బ్రాహ్మణవీధికి చెందిన పామూరి సాయివర్ధన్ తన భార్య అయిన పామూరి లక్ష్మీప్రసన్న (22)ను అదనపు కట్నం కోసం వేధించడంతో భర్త వేధింపులు భరించలేక 2023 మార్చి 29వ తేదీ తన చున్నీతో ఉరివేసుకుని చనిపోయింది.

మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి నందలూరు ఏఎస్ఐ జేవీ సుబ్బరాయుడు కేసు నమోదు చేశారన్నారు. అప్పటి రాజంపేట డీఎస్పీ జి.శివభాస్కర్ రెడ్డి, మరో డీఎస్పీ వీఎన్‌కే చైతన్య సాక్షులను విచారించి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారని తెలిపారు. దీనిపై రాజంపేట మూడవ ఏడీజే కోర్టు జడ్జి విచారణ జరిపి ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.


పోలీసుల అదుపులో ముద్దాయి సాయివర్ధన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పింఛా ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం



సుండుపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 997 అడుగుల వరకు చేరుకోగా, పై ప్రాంతాల నుంచి సుమారు 300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తున్నట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దిగువ ప్రాంతాలకు 12 క్యూసెక్కుల నీరు కాలువల ద్వారా విడుదల చేసినట్లు వివరించారు. బుధవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పై ప్రాంతాల నుంచి నీరు వచ్చే అవకాశం ఉందని, ప్రాజెక్టు దిగువ భాగంలోని ముడుంపాడు, నగిరి, కురవపల్లి, తొగురుపల్లి, టమటంవారిపల్లె, పెద్దినేనికాలువ హరిజనవాడ, రాగిమానుబిడికి, చిన్నబిడికి, పెద్దబిడికి, రాచపల్లి, రాయవరం రెడ్డివారిపల్లె, బాలాజీబిడికి, మిట్టబిడికి ప్రాంతాల ప్రజలు నదీ పరివాహక ప్రాంతానికి వెళ్లకూడదని హెచ్చరించారు. ఏ సమయంలోనైనా ప్రాజెక్టు నుంచి పింఛా నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, నది పరివాహక ప్రాంతానికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

కడప జిల్లా కోర్టు పీపీ పోస్టు అనంతపురం బదిలీ

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో ప్రస్తుతమున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును అనంతపురం జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప పీపీ పోస్టును ప్రస్తుతమున్న కేడర్ నుంచి ఇతరత్రా మార్పు చేయదలచిన దృష్ట్యా ఈ బదిలీ జరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో కడప కోర్టులో నిర్దిష్ట కాల వ్యవధితో పీపీ నియామకం చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అడ్డం పేరుతో అడ్డు తొలగిస్తున్నారు

- నేల కొరుగుతున్న మహావృక్షాలు
- వాల్టా చట్టం అపహాస్యం..
- గుట్టుగా కలప తరలింపు


మదనపల్లె-బెంగళూరు రోడ్డులో నేలకొరిగిన మర్రి వృక్షం, కలపను ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు (ఫైల్)


నేలకొరిగిన చింత వృక్షం

మదనపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 'మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మొక్కలు పెంచుదాం..ఆరోగ్యాన్ని పంచుదాం, అమ్మ పేరుతో ఒక మొక్క, ఇంటింటా చెట్టు..ఊరూరా వనం' అనే నినాదాల పేరుతో ప్రభుత్వాలు మొక్కలు పెంచాలని చెబుతున్నాయి. అడవుల సంరక్షణ, మొక్కల పరిరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామం, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. పైగా వాల్టా చట్టాన్ని కూడా అమలు చేస్తోంది. అయితే ఇదంతా ప్రచారం, చట్టాలు కాగితాలకే పరిమితం అయ్యాయే కానీ క్షేత్రస్థాయిలో మచ్చుకైనా కనిపించలేదు. ఇంటా బయటా, గట్టు గుట్టా, భూమి-పొలం ఇలా అనేక చోట్ల నిత్యం చెట్ల నుంచి భారీ వృక్షాల వరకు నేలకొరుగుతున్నాయి. వివిధ అవసరాలు, భూముల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ వ్యాపారం.. కారణం ఏదైనా అడ్డం పేరుతో వృక్షాలను అడ్డు తొలగిస్తున్నారు. చెట్టు, వృక్షం తొలగింపు తప్పనిసరైతే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. అందుకు అటవీశాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెట్టు, వృక్షం విలువ చెల్లించి అందుకు రెట్టింపుగా మొక్కలు నాటాల్సి ఉంది. అదేమీ లేకుండా చెట్లు కట్ చేసే ఏజెంట్లతో ఒప్పందం కుదుర్చుకుని కోసేసి వాటిని షామిల్లులకు తరలిస్తున్నారు.

పెద్ద పెద్ద వృక్షాలను ఎక్కడో అడవులు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎవరికీ తెలియదు అనుకోవచ్చు. పల్లె-పట్టణం, రాత్రి-పగలు అనే తేడా లేకుండా యంత్రాలతో నేలకూలుస్తున్నారు. వృక్షాలను కోయడానికే వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీరికి ఎలాంటి అనుమతులు లేకపోయినా రైతులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని కట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులో అయిదు రోజులుగా రెండు చోట్ల వృక్షాలను కోసేస్తున్నారు. వేపమాను కేంద్రం సమీపంలో ఒకచోట, రెడీఫుడ్స్ ఎదురుగా మామిడితోటలో దర్జాగా పని కానిస్తున్నారు. అటవీశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా శబ్దం లేని రంపాలతో నేల కూల్చేస్తున్నారు. ఇందులో భారీ మర్రి, చింత, వేప, అల్లనేరేడు, మామిడి, తదితర చెట్లు ఉన్నాయి. ఈ రెండుచోట్లా ఇప్పటికే పదుల సంఖ్యలో చెట్లు నేలకూలగా మరిన్ని సిద్ధంగా ఉన్నాయి. పట్టణం, ప్రధాన రహదారుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే..మారుమూల అటవీ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వృక్షాల కోతను నివారించాలంటే కలప మిల్లులు, వీటిని కట్ చేసే ఏజెంట్లపై నిఘా పెట్టడంతో పాటు వారికి తగిన స్థాయిలో ఆంక్షలు విధించాలని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.


తరలించడానికి సిద్ధం చేసిన కలప మొద్దులు

వాటికి అనుమతి లేదు

బెంగళూరు రోడ్డులోని రెండు ప్రాంతాల్లో చెట్లు కోస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భూమి యజమానులతో పాటు వాటిని కట్ చేసే వారిపై కూడా కేసులు నమోదు చేసి, అపరాధం విధిస్తాం. ఇప్పటికే మా సిబ్బందిని అక్కడికి పంపించి ఆపేశాం, చర్యలు తీసుకోమని ఆదేశించాం.

- ప్రసాద్‌రావు, అటవీ శాఖాధికారి, మదనపల్లె.

జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణ

ఆ భూముల్లో హైవే వెళుతుండటంతో అక్రమార్కుల కన్ను


జడ్‌హెచ్‌డీసీ భూముల్లో ఆక్రమణదారులు వేసిన ముళ్లకంచె

ఓబులవారిపల్లె ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని పొలాల్లో సుమారు 800 ఎకరాల పైచిలుకు జెడ్‌హెచ్‌డీసీకి సంబంధించిన భూములు ఉన్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలవారు పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వం ద్వారా బోర్లు, మొక్కలు పొంది సాగు చేసుకుని జీవిస్తుండగా మరికొంతమంది పొలాల్లో భూగర్భజలాలు లేకపోవడంతో బీళ్లుగా మిగిలి ఉన్నాయి. ఇటీవల కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే కారిడార్ రోడ్డు నిర్మాణం ఈ జడ్‌హెచ్‌డీసీ భూముల గుండా వెళుతుండడంతో ఆ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎంతలా అంటే ఒక సెంటు విలువ రూ.100 కూడా చేయని చోటు వేలాది రూపాయలు పలుకుతున్నాయి.

ఇదే అదునుగా చేసుకుని కొంతమంది ఒకరి భూములు మరొకరి పేరుతో తారుమారు చేసి భూములు అమ్మి లక్షలాది రూపాయలు దండుకొన్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చిన పట్టాలు ఒకరికైతే అక్రమంగా మరొకరు సాగులో ఉంటున్నారు. వీటికి సంబంధించిన లబ్ధిదారులు మండల స్థాయి రెవెన్యూ అధికారులకు ఎన్నిమార్లు అర్జీ పెట్టుకున్నా కూడా పరిష్కారం కాకపోవడంతో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా తూతూమంత్రంగానే వచ్చి వెళుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ వద్ద ప్రభుత్వం ద్వారా అందించిన పత్రాలు ఉన్నా నకిలీ పత్రాలు పొంది కొంతమంది దౌర్జన్యంగా భూములు సాగు చేసుకుంటూ దౌర్జన్యం చేస్తున్నారని, వీరిపై అధికారులకు ఫిర్యాదు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై కలెక్టర్ అయినా స్పందించి ఆక్రమణదారులకు అడ్డుకట్ట వేయాలని పలువురు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కోరుతున్నారు.

నిత్యపూజేశ్వర ఆలయ పాలకమండలి నోటిఫికేషన్ విడుదల

సిద్దవటం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిత్యపూజేశ్వర ఆలయ పాలకమండలిలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27 వరకు గడువు పొడిగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిత్యపూజేశ్వరకోన ఆలయ పాలకమండలి నియామకానికి దేవదాయ శాఖ అధికారులు ఈనెల 7న నోటిఫికేషన్ చేసినట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈనెల 27వ తేదీ లోగా జిల్లా దేవదాయశాఖ అధికారి కడప కార్యాలయానికి తమ దరఖాస్తులు పంపాలని ఆయన తెలిపారు.

సైబర్... టెర్రర్

- ఇన్వెస్ట్‌మెంటు పేరుతో బురిడీ
- ఆశపడితే.. బ్యాంకుల్లో నగదు ఖాళీ
- ఏడు నెలల్లో 700 ఫిర్యాదులు
- రూ.15 కోట్లకు పైగా స్వాహా



కడప క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో ఇన్వెస్ట్‌మెంటు పేరుతో నకిలీ యాప్‌లు ప్రవేశపెట్టి.. ఇందులో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయంటూ ఆశలు రేకెత్తించి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఇలాంటి మోసాలు జిల్లాలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి.

ఇన్వెస్ట్‌మెంటు అంటే...

మనం పెట్టిన డబ్బులకు రెట్టింపు ట్రేడ్ తెస్తామంటూ పలురకాల యాప్‌లను సోషల్ మీడియా గ్రూపుల్లో పెడతారు. తొలుత నమ్మకం కలిగేలా కొందరికి రెట్టింపు డబ్బులు ఇస్తారు. వేలల్లో ఉన్న పెట్టుబడులను లక్షలు, కోట్లలో పెట్టేలా చేసి.. చివరికి ఆ యాప్‌ను మాయం చేస్తారు. దీంతో పెట్టుబడులు పెట్టిన వారంతా డబ్బులన్నీ పోగొట్టుకొని... చేతులు కాలాక ఆకులు పట్టు కున్నచందంగా... లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పేర్లు, నకిలీ ఐడీ ప్రూఫ్‌లతో ఈ దందా నడపడంతో సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి పోలీసులు తలలు పట్టుకునే పరిస్థితి. కనీసం సైబర్ నేరగాళ్ల ఐడెంటిటీ కూడా ఎక్కడా కనిపించదు.

మోసపోయే వారంతా ఉద్యోగులు, విద్యావంతులే...

ఇన్వెస్ట్‌మెంటు దందాలో మోసపోతున్న వారిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యావంతులే ఉంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌లో వచ్చే యాప్‌లకు ఆకర్షితులై సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు. లక్షల రూపాయలు ఇన్వెస్ట్‌మెంటు చేసి.. వారి ఖాతా వివరాలు చెప్పడంతో సైబర్ నేరగాళ్లు ఈజీగా డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలా మోసపోతున్న ఘటనలు జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది ఏడు నెలల్లోనే దాదాపు 700 ఫిర్యాదులు వచ్చాయంటే ఏ స్థాయిలో సైబర్ నేరగాళ్ల మోసాలకు బలవుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. బాధితుల నుంచి దాదాపు రూ.15 కోట్లకు పైగా డబ్బులు స్వాహా చేయగా.. రూ.6కోట్లు వరకు పోలీసులు ఫ్రీజ్ చేశారు.

మోసపోయిన బాధితులు...

- కడపకు చెందిన ఓ ఉద్యోగి ఇన్వెస్ట్‌మెంటు యాప్ డౌన్‌లోడ్ చేసి.. రూ.20లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. లాభాల మాట దేవుడెరుగు.. తాను చెల్లించిన డబ్బు సైతం పోగొట్టుకున్నాడు. చేసేదిలేక పోలీసులను ఆశ్రయించారు.
- కడపకు చెందిన ఓ మహిళా ఉద్యోగి దాదాపు రూ.3లక్షలు ఇన్వెస్ట్‌మెంటులో పెట్టుబడులు పెట్టి పోగొట్టుకుంది.
- ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యాపారి, అలాగే అదే ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి పెట్టుబడులుగా లక్షల్లో పెట్టారు. అయితే వారు తమ డబ్బులు తీసుకునేందుకు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరికి పోలీసులను ఆశ్రయించారు.
- మైదుకూరు చెందిన పలువురు వ్యాపారులు ఓ వ్యక్తిని నమ్మి యాప్‌లలో లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. చివరికి ఎవరు స్పందించకపోవడంతో పెట్టుబడి పెట్టించిన వ్యక్తిపైనే వారు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అత్యాశకుపోయి ఆన్‌లైన్ మోసాలకు బలి కావద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి... ఎస్పీ అశోక్‌కుమార్



సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు రకరకాల పద్ధతులు అనుసరిస్తున్నారు. మీరు పెట్టే పెట్టుబడికి రెట్టింపు లాభాలు వస్తాయంటూ టెలిగ్రాం, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టులు పెట్టి మోసగిస్తున్నారు. ఈజీమనీ కోసం ఆశపడితే లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దు. టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులకు ముందుగా ఇన్వెస్ట్ చేసి డబ్బు డబుల్ చేసుకోండి అంటూ లింకులు పంపుతారు. ఆ లింకులు ఓపెన్ చేసి వారు చెప్పినట్లు చేస్తే.. మొదట వెయ్యి, 2వేలకు డబుల్ లాభాలు వచ్చేలా చూపిస్తారు. ఇంకా ఎక్కువ పెడితే అధిక లాభాలు పొందుతారని నమ్మిస్తారు. ఆశపడి పెట్టుబడి పెట్టి మోసపోవద్దు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఎలాంటి అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దు. ఒకవేళ ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే సైబర్‌క్రైం సెల్ నెంబర్ 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి.

17న జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ప్రొద్దుటూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళల బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు 17వ తేదీ నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.క్రిష్ణమూర్తి, కార్యదర్శి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపా రు. సబ్ జూనియర్స్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2010 జనవరి 2 తర్వాత జన్మించి ఉండాలన్నారు. సబ్‌జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా చెపూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నా రు. జట్టు ఎంపికకు వచ్చే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, బ్లడ్‌గ్రూపు, డ్రస్‌కోడ్, షూ వేసుకుని రావాలని కోరా రు. వివరాలకు 9490181104 నెంబరులో సంప్రదించాలని కోరారు.


క్రిస్టియన్ వివాహాల నమోదుకు ముగ్గురు పాస్టర్ల నియామకం

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో క్రిస్టియన్ మతానికి చెందిన వివాహాలను నిర్వహించి.. అందుకు తగ్గ వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కోసం ముగ్గురు పాస్టర్లను అధీకృతులుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పది సంవత్సరాల పదవీ కాలంతో ఈ నియామకాలు చేపట్టారు. చట్టపరిధిలో ఆచారాల ప్రకారం మతపరమైన వివాహాలు నిర్వహించడానికి వీరికి అధికారం కల్పించారు. కడప రాజారెడ్డి వీధికి చెందిన భవనాసి సుధీర్‌ను రిడీమర్ చర్చికి, పులివెందుల నగరిగుట్టకు చెందిన కోట్లల్‌మ్యానియల్‌ను నగరిగుట్ట రాక్ ప్రేయర్ హౌస్ చర్చికి, పులివెందుల నగరిగుట్టకే చెందిన పాగల యేసయ్యను షలేమ్ ప్రేయర్ హౌస్ చర్చికి నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి.శ్రీధర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పబ్లిక్ హెల్త్ వర్కర్ల డిప్యుటేషన్ రద్దు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 8 మంది పబ్లిక్ హెల్త్‌వర్కర్లు డిప్యుటేషన్‌పై పబ్లిక్ హెల్త్ మేస్త్రీలుగా గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి 8 మంది వర్కర్ల డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు రేపటి నుంచి పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఆయా డివిజన్లలో స్వీపర్లుగా, డ్రైన్ క్లీనర్లుగా వెళ్లి పనులు చేయాలని అందులో పేర్కొన్నారు. డిప్యూటేషన్లు రద్దు అయిన మేస్త్రీలలో నాలుగు డివిజన్‌లకు చెందిన చైతన్య, మోషా, వినోద్, ప్రసాద్, సరస్వతి, ఎం.రమేష్, ఈ రమేష్, ఓబులేసు ఉన్నారు.

20 టీఎంసీలకు చేరిన గండికోట నీటిమట్టం



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. బుధవారం 20 టీఎంసీలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటి ని విడుదల చేస్తున్నామన్నారు. కాగా బుధవారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 13,900 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రాజెక్టులోకి 2700 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 11,200 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం పైడిపాలెం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని మైలవరం జలాశయ అధికారులు తెలిపారు. బుధవారం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి పది వేల క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాలువలకు నూరు క్యూసెక్కులు చొప్పున నీరు వదులుతున్నట్లు తెలిపారు. వర్షానికి మైలవరం జలాశయంలో ఇన్‌ఫ్లో ఇంకా పెరిగితే పెన్నానదికి వదిలే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుం జలాశయంలో 5.4 టీఎంసీల నీరు నిలువ ఉంది.

పరవళ్లు తొక్కుతున్న కుందూ నది



చాపాడు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

చాపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కుందూ నది పరవళ్లు తొక్కుతోంది. బుధవారం నదిలో సుమారు 20 అడుగుల లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయి. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నదిలోకి నీళ్లు భారీగా వచ్చి చేరుతున్నాయి. కుందూ నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో నదీ పరివాహక గ్రామాలలో వరి నాట్లు నాటుతున్నారు. అన్నవరం, నాగులపల్లె, ఖాదర్‌పల్లె, చాపాడు, సీతారామపురం, పెద్దగురవలూరు, తదితర గ్రామాల వద్ద కుందూ నది తీరం వెంబడి రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

విద్యా సంబంధిత అంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా సంబంధిత అంశాలపై సంపూర్ణ అవాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో జిల్లా స్థాయిలో హ్యూమన్ క్యాపిటల్ వికసిత్ భారత్‌లో భాగంగా స్కూలింగ్, బిల్డింగ్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో చర్చించిన విషయాలను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడుతూ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు విలువైన సలహాలు ఇస్తే రాష్ట్రస్థాయ అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఎంఈఓలను, ప్రధానోపాధ్యాయులను ఐదు గ్రూప్‌లుగా విభజించి చర్చించి వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యాశాఖలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సరస్వతి, జిల్లా వైద్యశాఖ నుంచి వైద్యాధికారి వెంకట చంద్రా రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి



ఉమీర్ మృతదేహం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోత): మండలంలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్ సమీపంలో ఉన్న బావిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిందనూరు తాలూకా ఆర్ఎస్‌పోరు గ్రామానికి చెందిన ఉమీర్ (22) సిక్స్‌లైన్ రోడ్డుకు సంబంధించి రాడ్ బెండ్ హెల్పర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. బుధవారం వర్షం వస్తుండడంతో పని నిలిపి వేశారు. దీంతో ఉమీర్ సమీపంలోని బావి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అతనికి ఫిట్స్ రావడంతో బావిలో పడి మృతి చెందాడు. విష యాన్ని తోటి కార్మికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వేంపల్లె అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తీసుకెళ్లారు.

గుర్తుతెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన నజీర్ మృతదేహం

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జమ్మలమడుగు హైవేలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ నజీర్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా... మౌలా అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... షేక్ నజీర్ ప్రొద్దుటూరు మండలం అమృతనగర్‌కు చెందిన లారీ మెకానిక్. కొలిమిగుండ్ల దగ్గర లారీ చెడిపోవడంతో మరమ్మత్తులు చేయడానికి మంగళవారం బైకుపై మౌలా అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. లారీ రిపేరు అనంతరం ప్రొద్దుటూరుకు బయలు దేరి వస్తుండగా అర్ధరాత్రి ప్రొద్దుటూరుకు సమీపంలోని బళ్లారి క్రిష్ణపట్నం హైవేపై వెనకాల గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నజీర్ పైకి టైర్లు ఎక్కి శరీరం నుజ్జు నుజ్జు అయింది. వెనక ఉన్న మౌలా గాయాలతో బయటపడ్డాడు. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ రెడ్డి తెలిపారు.

పెన్నానదిలో యువకుడు గల్లంతు

పెన్నానదిలో యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం





విక్రమ్ (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో గల పెన్నానదిలో మంగళవారం సాయంత్రం నాయుని విక్రమ్ (19) అనే యువకుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే .. రామేశ్వరం మిట్టమడికి చెందిన విక్రమ్, మత్తయ్య, వెంకటసాయి, శివలింగమయ్య నలుగురు స్నేహితులు. వీరంతా కలిసి పెన్నానది వద్దకు నదిలోనీళ్ల ప్రవాహం చూడటానికి వెళ్లారు. విక్రమ్‌కు చెందిన చెప్పు నీళ్లలో పడటంతో నదిలోకి దిగి గల్లంతయినట్లు తల్లి రుక్మిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి వెల్లడించారు. సమాచారం తెలిసి రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూటీంగా వెళ్లి మంగళవారం సాయంత్రం నుంచి పెన్నానదిలో విక్రమ్ ఆచూకి కోసం వెతికారు. నదిలో నీటిప్రవాహం ఉధృతంగా వుండటంతో బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదని పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కడప క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆటోనగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సిద్దవటం మండలం ఎగువపేటకు చెందిన వెంకటేశ్ (29) కడపలో ప్రైవేటు దుకాణంలో పని చేస్తున్నాడు. రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నడిరోడ్డుపై దిగబడిన లారీ

- వాహనదారులు, రైతులకు ఇబ్బందులు



చిన్నమండెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న రోడ్డుపై దిగబడి పోవడంతో రైతులు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లు తీసుకెళుతున్న లారీ మంగళ వారం రాత్రి దేవగుడిపల్లె, రౌతుకుంట రహదారి లో దిగబడి పోయింది. ఎక్స్‌కవేటర్ సాయంతో రాత్రంతా శ్రమించినా ఫలితం లేకపోవడంతో, బుధవారం మరో ఎక్స్‌కవేటర్‌ను రప్పించి లారీని బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటుగా వెళుతున్న వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధిక లోడుతో వెళ్లే లారీలు ఈ మార్గంలో ఎక్కు వగా వెళుతుండడంతో రోడ్డు ధ్వంసమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పొలాలకు వెళ్లే రహదారుల్లో భారీ లోడు వాహనాలు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నారు.

ఇళ్లలో చోరీకి పాల్పడే దొంగ అరెస్టు

- బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ప్రొద్దుటూరు రూరల్ సీఐ



దొంగ నుంచి రికవరీ చేసిన బంగారు ఆభరణాలు



దొంగను చూపిస్తున్న సీఐ మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ

రాజుపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం మండలం టంగుటూరులో ఇటీవల పట్టపగలు చోరీకి యత్నించి.. అడ్డుకున్న ఇంటి యజమానిపై దాడి చేసిన నిందితుడు మహ్మద్‌రఫిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, రాజుపాలెం ఎస్ఐ వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దువ్వూరు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మహ్మద్‌రఫి గతంలో జిల్లాలోని పలుచోరీ కేసుల్లో నిందితుడని.. కర్నూలు, వెలుగోడు, కొలిమిగుండ్ల, ఓర్వకల్లు, చాగలమర్రి, ఆళ్లగడ్డ తదితర పోలీసు స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయన్నారు. పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. ఈనెల 7న టంగుటూరు గ్రామంలో నంద్యాల వెంకటసుబ్బయ్య ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి చోరీకి యత్నించాడు. అదే సమయంలో వెంకటసుబ్బయ్య ఇంటిలోకి రావడంతో నిందితుడు ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారన్నారు. దాడిలో తీవ్రంగా గాయప డిన ఇంటి యజమాని కేకలు వేయడంతో రఫి పారిపోయారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామ న్నారు. బుధవారం గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడి వద్ద నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. మహ్మద్‌రఫిపై దొంగతనం కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐ వివరించారు.

నేడు నీటి సంఘం అధ్యక్షులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

పుల్లంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట స్థానిక ఎంపీడీవో సభా భవనంలో పెనగలూరు, పుల్లంపేట మండలాల్లోని నీటిసంఘం అధ్యక్షులకు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఇరిగేషన్ ఏఈ నాయక్ తెలిపారు. చెరువు సమస్యలపై నీటిసంఘ అధ్యక్షులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడుతారని ఆయన తెలియజేశారు. నీటి సంఘం అధ్యక్షులందరూ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

రాయచోటి డిప్యూటీ డీఈవోగా నాగయ్య

రాజంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాయచోటి డిప్యూటీ డీఈవోగా నందలూరు మండల ఎంఈవో-1 ఎల్.నాగయ్యను నియమిస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నాగయ్య మూడేళ్లుగా నందలూరు ఎంఈవో-1గా పనిచేస్తున్నారు. ఆయనకు ప్రమోషన్ ఇస్తూ డిప్యూటీ డీఈవోగా ఉత్తర్వులు జారీ చేశారు.

రాజంపేట ఎంపీపీగా ఆరేళ్ల రమణమ్మ



ఆరేళ్ల రమణమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

రాజంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఆరేళ్ల రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి వర్గానికి చెందిన రమణమ్మను మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, తాళ్లపాక ఎంపీటీసీ పి.మధుసూదనవర్మ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా కూచివారిపల్లె-2 ఎంపీటీసీ ఆరేళ్ల రమణమ్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎం.నరసింహమూర్తి ప్రకటించారు. ఎంపీపీ వై.వెంకట నారాయణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానానికి బుధవారం మండల పరిషత్ సభా భవనంలో ఎం.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. వైసీపీకి చెందిన 12 మంది, టీడీపీకి చెందిన ఇరువురు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఎంపీపీ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించడంతో ఆ వర్గానికి చెందిన రమణమ్మ పోటీ చేశారు ఎంపీడీవో వరప్రసాద్, సూపరింటెండెంట్ బాల ముని స్వామి ఎన్నికలను పర్యవేక్షించారు. ఆరేళ్ల రమణమ్మ ఎంపీపీగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నరసింహమూర్తి ధ్రువపత్రాన్ని అందజేశారు.

గోతులమయమైన తహసీల్దార్ కార్యాలయ మార్గం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తేలికపాటి వర్షానికే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలోని గుంతల్లో నీరు నిలిచింది. ఈ గోతుల విషయం పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ గోతుల్లో నీరు నిలవడంతో వివిధ గ్రామాల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవారు ప్రమాదానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఈ దారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిరు జల్లులతో ఇబ్బందులు

పెనగలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల అల్పపీడనం కారణంగా మండలవ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు జల్లులు కురుస్తూ ఉన్నాయి. దీంతో రోడ్లు బురదమయమై ఇబ్బందికరంగా మారాయి. నిరాటంకంగా కురుస్తున్న జల్లులతో అన్నిరకాల కూలి పనులు చేసుకునేవారు ఇబ్బందులు పడ్డారు

చినుకు పడితే చెరువే..!

- ఉరుస్తున్న పాఠశాల భవనాలు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- ఇలాగైతే చదువు సాగేదెలా..?

రాయచోటి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాపం శెట్టిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శాపంగా మారింది. లోకల్ పొలిటిక్స్‌తో అభివృద్ధికి దూరమైంది. నాడు- నేడు కింద ఈ పాఠశాలకు 60 లక్షల రూపాయలు మంజూరైనా పాఠశాల పాలకవర్గం లేక పోవడంతో ఒక్క పనీ చేయలేదు. దీంతో పాఠశాలలో సమస్యలు పేరుకుపోయాయి. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనంలోని పలు తరగతి గదులకు కిటికీలు కూడా సక్రమంగా లేదు. గోడలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పైకప్పు ఉరుస్తూ కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో వర్షం పడితే ఉపాధ్యాయులు భయపడుతూనే పాఠాలు బోధిస్తుండగా, విద్యార్థులు ఒక మూలకు చేరి పాఠాలు వింటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు. పాఠశాలలో కనీస మౌలిక వసతులు కూడాలేవు. వంట గది లేకపోవడంతో ఆరుబయటే వంట చేస్తున్నారు. మరుగుదొడ్డి ఒక్కటే ఉండగా, దానికి తలుపు కూడా సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మౌలిక వసతులను కల్పించడంతోపాటు, భవనానికి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.



తరగతి గదిలో ఓ మూల కూర్చున్న విద్యార్థినులు



పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

వర్షం పడితే భయమేస్తుంది



వర్షం పడితే ఉన్న అన్ని గదులు తడుస్తున్నాయి. కిటికీలు సక్రమంగా లేవు. పైకప్పు , గోడలు కూలి పోయేందుకు సిద్దంగా ఉన్నాయి. దీంతో తరగతి గదిలో ఉండాలంటే భయమేస్తోంది. పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలి.

- సాయిప్రదీప్, విద్యార్థి

నిధులు ఇస్తే తప్ప ఏమీ చేయలేం



పాఠశాలలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవు. తరగతి గదులు చూస్తే భయమేస్తోంది. రాజకీయాలతో పాఠశాలను భ్రష్టు పట్టించారు. పై స్థాయి అధికారులకు తెలియజేశాం. ఇప్పటికైనా పాఠశాలకు నిధులు కేటాయిస్తే ప్రయోజనం ఉంటుంది.

- వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి : ముక్కా

ఓబులవారిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. చిన్న ఓరంపాడు నుంచి పెద్ద ఓరంపాడు వరకు, కాకర్లవారి పల్లెకు వెళ్లేందుకు సుమారు రూ.7.52 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న తారు రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీకే రోడ్డు నుంచి తుమ్మకొండ, వడ్డిపల్లె, కాకర్లవారిపల్లె, పెద్దఓరంపాడు, చిన్నఓరంపాడు మీదుగా సీఆర్‌పీ రోడ్డు వరకు రోడ్డు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, జి.పెంచలయ్య, కల్లా చలపతి, జోగినేని మణి, తిరుపాల్, వేణుగోపాల్‌రెడ్డి, పయ్యావుల కోటేశ్వర్‌రావు, ఈశ్వర్‌నాయుడు, నాగినేని రమేష్‌నాయుడు కాంట్రాక్టర్ సుబ్బారెడ్డితో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు, : రూ. 5.70 కోట్లతో కోడూరు-గుర్రప్పపాలెం వంతెన పనులకు కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన గిరిజన కాలనీకే కాకుండా రెడ్డివారిపల్లె, చియ్యవరం, పిల్లగుట్టకాలనీ తదితర 16 గ్రామాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ఉడుం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తారురోడ్డు పనులను ప్రారంభిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం, భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆ మేరకు బుధవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వైద్యులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మానసికంగా కుంగిపోతారని, అనేక వ్యాధులు వస్తాయని వివరించారు. విద్యార్థులు ప్రజలకు మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించాలన్నారు. లేకుంటే యువత నిండు జీవితాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత దేశానికి ఆదర్శంగా నిలవాలి కాని మాదకద్రవ్యాలకు లోనుకాకుండా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ కే. రమేష్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి. దయానందం, డీఎఫ్ ఏపీ కో-ఆర్డినేటర్ డి. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరిమోషే, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మాదక ద్రవ్యాలు వినియోగించం అని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. పెనగలూరు అరుంధతివాడ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త చింతా భాగ్యమ్మ , సహాయకురాలు కొంచెం కన్నమ్మ, గ్రామ పెద్దలు పి.రమణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: స్థానిక ఆదర్శపాఠశాలలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఎస్ఐ సుధాకర్‌తో మత్తు పదార్థాలు. సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు ప్రిన్సిపాల్ మస్తాన్ వలి మాట్లాడుతూ పోలీసు అధికారులు చెప్పిన విషయాలను శ్రద్ధగా ఆచరించి మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సుబ్బరాయుడు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుండుపల్లె : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వరప్రసాద్

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

నందలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌరుడు తన ఇంటి పైభాగంలో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశ భక్తిని చాటాలని పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని నందలూరు గ్రామ పంచాయతి కార్యాలయంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జవాన్ దారా రత్నమయ్యను ఎంపీడీవో రాధాకృష్ణన్, డిప్యూటీ ఎంపీడీవో సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మోడ పోతుల రాము శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైల్వే కోడూరులో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. రమేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపైన జాతీయ పతాకం ఎగురవేయాలన్నారు. స్వాతంత్ర్యం కోసం పాటు పడిన మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. అయ్యవారిపల్లెలో విద్యార్థులు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు.



తిరంగా బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీవో విజయరావు

పెనగలూరు: ఎంపీడీవో ఎస్.విజయరావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు తిరంగా బైకు ర్యాలీ నిర్వహించారు. హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, ఏపీఎం నిరంజన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సురేష్, పి.కొత్తపల్లె గ్రామస్థులు ముస్తాక్ తదితరు లు పాల్గొన్నారు.

16 నుంచి గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవాలు

రాయచోటిటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గాలివీడు రోడ్డులో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన గంగమ్మ ఆలయం ప్రారంభోత్సవాలు ఈ నెల 16 నుంచి నిర్వహించనున్నట్లు ఆయన కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబు తెలియ జేశారు. 16న ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, మహానైవేద్యం, మంగళహారతి, 17న ఉదయం 8.30 గంటలకు ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, నవగ్రహ, చండీ హోమం, 18న గంగాదేవి, పోతురాజు విగ్రహ, శిఖర ప్రతిష్ఠ ఉంటాయన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీపీఐ ధ్యేయం

రాయచోటిటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడి ప్రత్యామ్నాయ రాజకీయాల దిశగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ఒంగోలులో ఈ నెల 23న నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక రైతు ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ. మహేశ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో చలో ఒంగోలు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ. రాజా, జాతీయ కార్యదర్శి కే. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రావుల వెంకయ్య, సినీ కళాకారులు, ప్రజాస్వామ్యవాదులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ శ్రమజీవుల స్వేదంతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదానీ లాంటి సంస్థలకు కారుచౌకగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను, మావోయిస్టులను అంతం చేస్తున్నారని, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి దోపిడీకి కార్పొరేట్లకు అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలైన పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు, ఇంటి నిర్మాణానికి 4 లక్షల పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వంపై నమ్మకం పోయిందన్నారు. నిరుద్యోగ భృతి నీరుగారిపోయి, నోటిఫికేషన్లపై ఆశలు వదులుకుంటున్నారని, ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, సాంబశివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

- అధికారులకు మంత్రి మండిపల్లి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సామాన్య ప్రజల సమస్యలపై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాల ఏకరి చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, కొంత మంది నేతలు, ప్రజలు మంత్రికి గజమాలతో పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు.

గొర్లముదివేడు సొసైటీ అధ్యక్షుడుగా పోలు రంగారెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొర్లముదివేడు సింగిల్‌విండో అధ్యక్షుడుగా రంగారెడ్డి నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లాలో మూడు సొసైటీలకు కమిటీలను ప్రకటించగా, గొర్లముదివేడు సొసైటీ అధ్యక్షుడుగా మాధవరానికి చెందిన టీడీపీ నాయకులు పోలు రంగారెడి , డైరెక్టర్లుగా పెమ్మాడపల్లి మాజీ సర్పంచ్ బసయ్య, గొర్లముదివేడు మాజీ సర్పంచ్ షేక్. జిలానీబాషాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం వారు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

దేవపట్ల సహకార బ్యాంక్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

సంబేపల్లె, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): దేవపట్ల సహకార బ్యాంక్ చైర్మన్‌గా దుద్యాల గ్రామం మల్లూరు కోటేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ మెంబర్లుగా ఎస్. సోమవరం గ్రామానికి చెందిన రాళ్లపల్లి వేణుగోపాల్‌నాయుడు గురిగింజకుంటకు చెందిన కృష్ణమనాయుడు బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ నాయకులు నూరెకరాల రంగారెడ్డి, మండిపల్లి సిద్దారెడ్డి, ఆలంసాబ్, జయరాం, అఖండనాయక్, ఆవుల శేఖర్‌రెడ్డి, సంబేపల్లె సింగిల్‌విండో అధ్యక్షుడు మోటకట్ల శివప్రసాద్‌రెడ్డి, భయ్యారెడ్డి, సాంబశివారెడ్డి, ఎద్దుల చిన్నప్ప, మల్లు బాబురెడ్డి, రెడ్డెప్ప, ఆంజనేయరెడ్డి, సొసైటీ కార్యదర్శి అన్సర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేయాలి

రామాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా దేవాదాయశాఖ అధికారి, రామాపురం మండల ప్రత్యేక అధికారి విశ్వనాథ్ సూచించారు. మండలంలోని నీలకంఠ్రావుపేట, గువ్వలచెరువు గ్రామాల్లో బుధవారం పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గువ్వలచెరువు గ్రామంలో 38 పక్కా గృహాలు మంజూరు కాగా అందులో 11, నీలకంఠ్రావుపేటలో 101 పక్కా గృహాలు మంజూరు కాగా 11 గృహాలు మాత్రమే పూర్తయ్యా యన్నారు. అందరూ ఈ నెల ఆఖరు లోపు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పక్కా గృహాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి విశ్వనాథ్

పారిశుధ్య చర్యలు ప్రారంభించండి

సంబేపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తక్షణం పారిశుధ్య పనులు ప్రారంభించాలని రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్ఎన్ కాలనీ ఆరోగ్య కేంద్రంలో ఎస్ కాలనీ-2 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం కృష్ణాపురంలో పారిశుధ్య సమస్యలను సూపర్‌వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్‌లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మురుగునీటిని పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఏఈ, శానిటరీ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పట్టణంలో శుభ్రతను పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.



అపరిశుభ్ర ప్రాంతాలను కమిషనర్‌కు చూపుతున్న వైద్య సిబ్బంది

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ఒంటిమిట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గుర్రంకొండ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కడప సెర్ప్ ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. బుధవారం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మికి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. దాడులకు పాల్పడిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం లావణ్య, ఏపీఎం అశోక్ రెడ్డయ్య, అంజనేయులు, సుబ్బయ్య, సురేష్, సీసీలు సుబ్బారెడ్డి, నాగార్జున, కడపజిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బంది పాల్గొన్నారు.



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వెలుగు సంఘం నాయకులు


నిత్యపూజకోన ఆలయ హుండీ లెక్కింపు

సిద్దవటం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): లంకమల అభయారణ్యంలోని నిత్య పూజేశ్వర కోన ఆలయంలో బుధవారం జూన్, జూలై నెలల్లో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలు లెక్కించినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ లెక్కింపులో రూ.1,38,003 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఇన్‌చార్జి ఈవో శ్రీధర్, ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ, ఉత్సవ కమిటీ మాజీ సభ్యుడు జ్యోతి సుబ్బారెడ్డి, ఎండోమెంట్ సిబ్బంది చంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు. కల్యాణకట్ట వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని బుధవారం తొలగించారు.



ఆలయ హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

పెనగలూరు విద్యుత్ ఏఈగా ఓబుల్‌రెడ్డి



పెనగలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యుత్‌శాఖ ఏఈగా బుధవారం రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన రైల్వే కోడూరు నుంచి పెనగలూరుకు బదిలీ అయ్యారు. ఆరు నెలలుగా పెనగలూరు ఏఈ పోస్టు ఖాళీగా ఉండడంతో లైన్ ఇన్‌స్పెక్టర్లే సమస్యలు పరిష్కరించారు.

రౌద్రాల అంకాళమ్మ ఆలయ చైర్మన్‌గా కోడి రామకృష్ణారెడ్డి


కోడి రామకృష్ణారెడ్డి

పీలేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ దేవత అయిన రౌద్రాల అంకాళమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు విశ్రాంత మేనేజర్ కోడి రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. తనతో పాటు మరో 9 మందిని ప్రభుత్వం సభ్యులుగా నియమించిందని, త్వరలోనే తాము ప్రమాణస్వీకారం చేస్తామని ఆయన తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


రామచంద్రరాజు(ఫైల్)

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదవరంపోడు పంచాయతీ పరిధి ప్రధాన జాతీయ రహదారి వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉపాధ్యాయుడు రామచంద్రరాజు (60) మృతి చెందాడు. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ వివరాల మేరకు... కోడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరాజు మంగళవారం అర్ధరాత్రి ఆటోలో కోడూరు నుంచి మాధవరంపోడు గ్రామానికి చేరుకుని రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు వెంటనే స్థానికులు కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య మాధవరంపోడులో అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది.

ఆత్మలు 'ఉపాధి' పనులు చేశాయి...!

- చనిపోయిన వ్యక్తుల పేరిట బిల్లులు
- టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సస్పెన్షన్
- గోకులం బిల్లుకు రూ.10 వేలు లంచం
- దొంగ మస్టర్లతో బిల్లులు స్వాహా
- సామాజిక తనిఖీలో వెలుగులోకి...

గుర్రంకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల ఆత్మలు వచ్చి గుర్రంకొండ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనులు చేశాయి. ఈ ఆత్మలు కూడా వారం రోజుల పాటు ఉపాధి పథకంలో వంక పనులు, చెరువులో పూడికతీత పనులు, పండ్ల తోటల పనులు చేయడం విశేషం. గ్రామాల్లో పాడి రైతుల కోసం నిర్మించిన గోకులాల్లో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీ బృందం బహిరంగ సభలో వెల్లడించింది. అంతేకుండా గోకులం షెడ్‌కు బిల్లు మంజూరు చేయాలంటే రూ.10 వేలు లంచం ఇచ్చినట్లు టీడీపీ సీనియర్ నేత జిల్లా అధికారులకు సమావేశంలో ఫిర్యాదు చేయడం ఉపాధి సిబ్బంది అవినీతి, అక్రమాలకు నిదర్శనంగా మారింది. అలాగే ఉపాధి పనుల్లో కూలీలు పనులు చేయకనే బినామీ పేర్లతో బిల్లులను డ్రా చేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. అంతేకాకుండా దొంగ మస్టర్లతో పలు గ్రామాల్లో బిల్లులు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది.

గుర్రంకొండ మండలంలోని ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులు చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ.5.50 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులతో రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం, పూడికతీత పనులు, చెరువుల్లో పూడికతీత పనులు, వంక పనులు, ట్రెంచ్ పనులు, సీసీ రోడ్లు, గోకులం షెడ్లను నిర్మించారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందం పది రోజులపాటు గ్రామాల్లో తిరిగి ప్రతి పనిని తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడించారు. ఇందులో భాగంగా మండలంలోని సరిమడుగు పంచాయతీలో ఉపాధి హామీ పనులను రెండేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులు చేసినట్లు చూపి బిల్లులను డ్రా చేశారు. గ్రామానికి చెందిన చిన్నరమణ 2023వ సంవత్సరం, రెడ్డెమ్మ 2021లో చనిపోయారు. వీరిద్దరూ ఉపాధి హామి పథకంలో 2024వ సంవత్సరంలో పనులు చేసినట్లు చూపి బిల్లులను డ్రా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అలాగే శెట్టివారిపల్లె పంచాయితీలో నిర్మించిన రెండు గోకులాలు బినామీ పేర్లతో నిర్మించినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించడంతో బినామీలకు, రైతులకు వాగ్వాదం జరిగింది. దీంతో రెండు గోకులాల నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీడీ మధుబాబును పీడీ ఆదేశించారు. అలాగే టి.రాచపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ సింగిల్ విండ్ చైర్మన్ మహాత్మారెడ్డి తన భార్య పేరిట గోకులం షెడ్ మంజూరైతే బిల్లు చేయడానికి టీఏ మదన్‌మోహన్‌రాజుకు రూ.10 వేలు లంచం ఇచ్చినట్లు పీడీకి ఫిర్యాదు చేశాడు. అలాగే మర్రిపాడు, రామాపురం, ఎల్లుట్ల, సరిమడుగు. చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో దొంగ మస్టర్లను వేసి బిల్లులు డ్రా చేసినట్లు తనిఖీ బృందం తెలిపింది. అలాగే గుర్రంకొండ పంచాయతీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పనులు చేసినట్లు చూపి నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. గుర్రంకొండ, టి.పసలవాండ్లపల్లెలో హౌసింగ్ బిల్లులను లబ్ధిదారుల పేరిట కాకుండా బినామీ వ్యక్తుల ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ గ్రామాల్లో జరిగిన చెరువులకు నీరు చేరే వంక పనుల్లో పని పరిమాణం తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే పలు గ్రామాల్లో ఏపీవో జయరామిరెడ్డి మస్టర్లను తనిఖీ చేయకపోవడంతో అవినీతి, అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందం తెలిపింది.


గోకులాల నిర్మాణాల్లో అక్రమాలను వెల్లడిస్తున్న డీఆర్పీ మణికంఠ

ఇద్దరు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

గుర్రంకొండ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. సరిమడుగు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పూజిత, టెక్నికల్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రాజులను సస్పెండ్ చేసినట్లు పీడీ తెలిపారు. అలాగే వివిధ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాల నుంచి రూ.7 వేలు రికవరీ చేయగా 8 వర్క్ ఐడీలో జరిగిన పనులపై విచారణ చేయాలని ఏపీడీ మధుబాబును ఆదేశించారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.2,39,372 లక్షలు అవినీతి జరిగినట్లు పీడీ తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఆమె తండ్రి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ టి. సదుం పంచాయతీ రామాపురం వాసి వెంకటరమణ కుమార్తె మలిశెట్టి రత్నమ్మ (30) మదనపల్లెలోని మెడికల్ షాపులో పనిచేస్తుండేది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లికు చెందిన బాల్లాపురం జ్యోతిశేఖర్ ఆమెను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు మునిష్కరనందన్ (2) ఉన్నాడు. అయితే భర్త పెయింటింగ్ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి రత్నమ్మ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. దీంతో తండ్రి వెంకటరమణ ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశామన్నారు.

ఇళ్లను త్వరగా పూర్తి చేయండి


ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్

నిమ్మనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్ వున్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి సతీశ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక దండువారిపల్లిలో ఉన్న లేఅవుట్‌ను ఎంపీడీవో రమేశ్‌తో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు సరైన సమయానికి నిర్మించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అదనంగా డబ్బు మంజూరు చేసినా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేక పోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారుల్లో చైతన్యం తెచ్చి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పనులు సక్రమంగా చేయని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కాటమరాజు స్థల పట్టా రద్దు చేయండి

- స్థలాన్ని గుడి ఉత్సవానికి కేటాయించండి: కలెక్టర్ శ్రీధర్

గాలివీడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాటమరాజు ఉత్సవానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి పట్టాను రద్దు చేసి తిరిగి గుడి ఉత్సవాలకే కేటాయించాలని తహసీల్దార్ భాగ్యలతను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లెకు సమీపంలో గత కొన్ని వందల సంవత్సరాలుగా సంక్రాంతి నాడు చిట్లాకుప్ప వేసుకునే కాటమరాజు ఉత్సవ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తి డీకేటీ పట్టా చేయించుకుని దాని చుట్టూ కంచె వేసిన విషయాన్ని ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కలెక్టర్‌తో మాట్లాడుతూ మా ఊరు పుట్టినప్పటి నుంచి ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ రోజు అంగరంగ వైభవంగా కాటమరాజు ఉత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఈ స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తెలియకుండా డీకేటా పట్టా చేయించుకుని ఉత్సవం జరుపుకోవడానికి కూడా అవకాశం లేకుండా చుట్టూ కంచె వేశాడని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కాటమరాజు స్థలాన్ని ఆక్రమించుకున్న కుటుంబ సభ్యులకు ఎన్ని ఎకరాల వరకు డీకేటీ పట్టా ఉంది, ఎంతమంది పేర్ల మీద డీకేటీ ఉన్నది అనే విషయాన్ని పరిశీలించి వెంటనే పట్టా రద్దు చేయడానికి తగిన ప్రతిపాదనలు తమకు పంపాలని తహసీల్దార్‌కు తెలిపారు. ఎక్కడ కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కాటమరాజు స్థల వివాదానికి సంబంధించి తమ దృష్టికి వచ్చిందని, తాను ఇరుపక్షాలతో మాట్లాడి ఉత్సవాన్ని జరుపుకోవడానికి స్థలం ఇవ్వాలని తాను కూడా వారికి తెలియజేసినట్లు తహసీల్దార్ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


కాటమరాజు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

భార్య మృతి కేసులో భర్తకు పదేళ్ల జైలుశిక్ష

- రాజంపేట మూడవ ఏడీజే కోర్టు తీర్పు


నందలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వరకట్న మరణం కేసులో ముద్దాయి పామూరు సాయివర్ధన్‌కు రాజంపేట మూడవ ఏడీజే కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ 10 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నందలూరులోని బ్రాహ్మణవీధికి చెందిన పామూరి సాయివర్ధన్ తన భార్య అయిన పామూరి లక్ష్మీప్రసన్న (22)ను అదనపు కట్నం కోసం వేధించడంతో భర్త వేధింపులు భరించలేక 2023 మార్చి 29వ తేదీ తన చున్నీతో ఉరివేసుకుని చనిపోయింది.

మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి నందలూరు ఏఎస్ఐ జేవీ సుబ్బరాయుడు కేసు నమోదు చేశారన్నారు. అప్పటి రాజంపేట డీఎస్పీ జి.శివభాస్కర్ రెడ్డి, మరో డీఎస్పీ వీఎన్‌కే చైతన్య సాక్షులను విచారించి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారని తెలిపారు. దీనిపై రాజంపేట మూడవ ఏడీజే కోర్టు జడ్జి విచారణ జరిపి ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.


పోలీసుల అదుపులో ముద్దాయి సాయివర్ధన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పింఛా ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం



సుండుపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 997 అడుగుల వరకు చేరుకోగా, పై ప్రాంతాల నుంచి సుమారు 300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తున్నట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దిగువ ప్రాంతాలకు 12 క్యూసెక్కుల నీరు కాలువల ద్వారా విడుదల చేసినట్లు వివరించారు. బుధవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పై ప్రాంతాల నుంచి నీరు వచ్చే అవకాశం ఉందని, ప్రాజెక్టు దిగువ భాగంలోని ముడుంపాడు, నగిరి, కురవపల్లి, తొగురుపల్లి, టమటంవారిపల్లె, పెద్దినేనికాలువ హరిజనవాడ, రాగిమానుబిడికి, చిన్నబిడికి, పెద్దబిడికి, రాచపల్లి, రాయవరం రెడ్డివారిపల్లె, బాలాజీబిడికి, మిట్టబిడికి ప్రాంతాల ప్రజలు నదీ పరివాహక ప్రాంతానికి వెళ్లకూడదని హెచ్చరించారు. ఏ సమయంలోనైనా ప్రాజెక్టు నుంచి పింఛా నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, నది పరివాహక ప్రాంతానికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

కడప జిల్లా కోర్టు పీపీ పోస్టు అనంతపురం బదిలీ


కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో ప్రస్తుతమున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును అనంతపురం జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప పీపీ పోస్టును ప్రస్తుతమున్న కేడర్ నుంచి ఇతరత్రా మార్పు చేయదలచిన దృష్ట్యా ఈ బదిలీ జరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో కడప కోర్టులో నిర్దిష్ట కాల వ్యవధితో పీపీ నియామకం చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అడ్డం పేరుతో అడ్డు తొలగిస్తున్నారు

- నేల కొరుగుతున్న మహావృక్షాలు
- వాల్టా చట్టం అపహాస్యం..
- గుట్టుగా కలప తరలింపు

మదనపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 'మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మొక్కలు పెంచుదాం..ఆరోగ్యాన్ని పంచుదాం, అమ్మ పేరుతో ఒక మొక్క, ఇంటింటా చెట్టు..ఊరూరా వనం' అనే నినాదాల పేరుతో ప్రభుత్వాలు మొక్కలు పెంచాలని చెబుతున్నాయి. అడవుల సంరక్షణ, మొక్కల పరిరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామం, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. పైగా వాల్టా చట్టాన్ని కూడా అమలు చేస్తోంది. అయితే ఇదంతా ప్రచారం, చట్టాలు కాగితాలకే పరిమితం అయ్యాయే కానీ క్షేత్రస్థాయిలో మచ్చుకైనా కనిపించలేదు. ఇంటా బయటా, గట్టు గుట్టా, భూమి-పొలం ఇలా అనేక చోట్ల నిత్యం చెట్ల నుంచి భారీ వృక్షాల వరకు నేలకొరుగుతున్నాయి. వివిధ అవసరాలు, భూముల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ వ్యాపారం.. కారణం ఏదైనా అడ్డం పేరుతో వృక్షాలను అడ్డు తొలగిస్తున్నారు. చెట్టు, వృక్షం తొలగింపు తప్పనిసరైతే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. అందుకు అటవీశాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెట్టు, వృక్షం విలువ చెల్లించి అందుకు రెట్టింపుగా మొక్కలు నాటాల్సి ఉంది. అదేమీ లేకుండా చెట్లు కట్ చేసే ఏజెంట్లతో ఒప్పందం కుదుర్చుకుని కోసేసి వాటిని షామిల్లులకు తరలిస్తున్నారు.


మదనపల్లె-బెంగళూరు రోడ్డులో నేలకొరిగిన మర్రి వృక్షం, కలపను ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు (ఫైల్)


నేలకొరిగిన చింత వృక్షం

పెద్ద పెద్ద వృక్షాలను ఎక్కడో అడవులు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎవరికీ తెలియదు అనుకోవచ్చు. పల్లె-పట్టణం, రాత్రి-పగలు అనే తేడా లేకుండా యంత్రాలతో నేలకూలుస్తున్నారు. వృక్షాలను కోయడానికే వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీరికి ఎలాంటి అనుమతులు లేకపోయినా రైతులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని కట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులో అయిదు రోజులుగా రెండు చోట్ల వృక్షాలను కోసేస్తున్నారు. వేపమాను కేంద్రం సమీపంలో ఒకచోట, రెడీఫుడ్స్ ఎదురుగా మామిడితోటలో దర్జాగా పని కానిస్తున్నారు. అటవీశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా శబ్దం లేని రంపాలతో నేల కూల్చేస్తున్నారు. ఇందులో భారీ మర్రి, చింత, వేప, అల్లనేరేడు, మామిడి, తదితర చెట్లు ఉన్నాయి. ఈ రెండుచోట్లా ఇప్పటికే పదుల సంఖ్యలో చెట్లు నేలకూలగా మరిన్ని సిద్ధంగా ఉన్నాయి. పట్టణం, ప్రధాన రహదారుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే..మారుమూల అటవీ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వృక్షాల కోతను నివారించాలంటే కలప మిల్లులు, వీటిని కట్ చేసే ఏజెంట్లపై నిఘా పెట్టడంతో పాటు వారికి తగిన స్థాయిలో ఆంక్షలు విధించాలని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.


తరలించడానికి సిద్ధం చేసిన కలప మొద్దులు

వాటికి అనుమతి లేదు

బెంగళూరు రోడ్డులోని రెండు ప్రాంతాల్లో చెట్లు కోస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భూమి యజమానులతో పాటు వాటిని కట్ చేసే వారిపై కూడా కేసులు నమోదు చేసి, అపరాధం విధిస్తాం. ఇప్పటికే మా సిబ్బందిని అక్కడికి పంపించి ఆపేశాం, చర్యలు తీసుకోమని ఆదేశించాం.

\- ప్రసాద్‌రావు, అటవీ శాఖాధికారి, మదనపల్లె.

జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణ

ఆ భూముల్లో హైవే వెళుతుండటంతో అక్రమార్కుల కన్ను

ఓబులవారిపల్లె ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని పొలాల్లో సుమారు 800 ఎకరాల పైచిలుకు జెడ్‌హెచ్‌డీసీకి సంబంధించిన భూములు ఉన్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారు పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంత మంది ప్రభుత్వం ద్వారా బోర్లు, మొక్కలు పొంది సాగు చేసుకుని జీవిస్తుండగా మరికొంతమంది పొలాల్లో భూగర్భజలాలు లేకపోవడంతో బీళ్లుగా మిగిలి ఉన్నాయి. ఇటీవల కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే కారిడార్ రోడ్డు నిర్మాణం ఈ జడ్‌హెచ్‌డీసీ భూముల గుండా వెళుతుండడంతో ఆ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎంతలా అంటే ఒక సెంటు విలువ రూ.100 కూడా చేయని చోటు వేలాది రూపాయలు పలుకుతున్నాయి.


జడ్‌హెచ్‌డీసీ భూముల్లో ఆక్రమణదారులు వేసిన ముళ్లకంచె

ఇదే అదునుగా చేసుకుని కొంతమంది ఒకరి భూములు మరొకరి పేరుతో తారుమారు చేసి భూములు అమ్మి లక్షలాది రూపాయలు దండుకొన్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చిన పట్టాలు ఒకరికైతే అక్రమంగా మరొకరు సాగులో ఉంటున్నారు. వీటికి సంబంధించిన లబ్ధిదారులు మండల స్థాయి రెవెన్యూ అధికారులకు ఎన్నిమార్లు అర్జీ పెట్టుకున్నా కూడా పరిష్కారం కాకపోవడంతో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా తూతూమంత్రంగానే వచ్చి వెళుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ వద్ద ప్రభుత్వం ద్వారా అందించిన పత్రాలు ఉన్నా నకిలీ పత్రాలు పొంది కొంతమంది దౌర్జన్యంగా భూములు సాగు చేసుకుంటూ దౌర్జన్యం చేస్తున్నారని, వీరిపై అధికారులకు ఫిర్యాదు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై కలెక్టర్ అయినా స్పందించి ఆక్రమణదారులకు అడ్డుకట్ట వేయాలని పలువురు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కోరుతున్నారు.

నిత్యపూజేశ్వర ఆలయ పాలకమండలి నోటిఫికేషన్ విడుదల

సిద్దవటం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిత్యపూజేశ్వర ఆలయ పాలకమండలిలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27 వరకు గడువు పొడిగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిత్యపూజేశ్వరకోన ఆలయ పాలకమండలి నియామకానికి దేవదాయ శాఖ అధికారులు ఈనెల 7న నోటిఫికేషన్ చేసినట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈనెల 27వ తేదీ లోగా జిల్లా దేవదాయశాఖ అధికారి కడప కార్యాలయానికి తమ దరఖాస్తులు పంపాలని ఆయన తెలిపారు.

సైబర్... టెర్రర్



- ఇన్వెస్ట్‌మెంటు పేరుతో బురిడీ
- ఆశపడితే.. బ్యాంకుల్లో నగదు ఖాళీ
- ఏడు నెలల్లో 700 ఫిర్యాదులు
- రూ.15 కోట్లకు పైగా స్వాహా

కడప క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో ఇన్వెస్ట్‌మెంటు పేరుతో నకిలీ యాప్‌లు ప్రవేశపెట్టి.. ఇందులో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయంటూ ఆశలు రేకెత్తించి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఇలాంటి మోసాలు జిల్లాలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి.

ఇన్వెస్ట్‌మెంటు అంటే...

మనం పెట్టిన డబ్బులకు రెట్టింపు ట్రేడ్ తెస్తామంటూ పలురకాల యాప్‌లను సోషల్ మీడియా గ్రూపుల్లో పెడతారు. తొలుత నమ్మకం కలిగేలా కొందరికి రెట్టింపు డబ్బులు ఇస్తారు. వేలల్లో ఉన్న పెట్టుబడులను లక్షలు, కోట్లలో పెట్టేలా చేసి.. చివరికి ఆ యాప్‌ను మాయం చేస్తారు. దీంతో పెట్టుబడులు పెట్టిన వారంతా డబ్బులన్నీ పోగొట్టుకొని... చేతులు కాలాక ఆకులు పట్టు కున్నచందంగా... లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పేర్లు, నకిలీ ఐడీ ప్రూఫ్‌లతో ఈ దందా నడపడంతో సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి పోలీసులు తలలు పట్టుకునే పరిస్థితి. కనీసం సైబర్ నేరగాళ్ల ఐడెంటిటీ కూడా ఎక్కడా కనిపించదు.

మోసపోయే వారంతా ఉద్యోగులు, విద్యావంతులే...

ఇన్వెస్ట్‌మెంటు దందాలో మోసపోతున్న వారిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యావంతులే ఉంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌లో వచ్చే యాప్‌లకు ఆకర్షితులై సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు. లక్షల రూపాయలు ఇన్వెస్ట్‌మెంటు చేసి.. వారి ఖాతా వివరాలు చెప్పడంతో సైబర్ నేరగాళ్లు ఈజీగా డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలా మోసపోతున్న ఘటనలు జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది ఏడు నెలల్లోనే దాదాపు 700 ఫిర్యాదులు వచ్చాయంటే ఏ స్థాయిలో సైబర్ నేరగాళ్ల మోసాలకు బలవుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. బాధితుల నుంచి దాదాపు రూ.15 కోట్లకు పైగా డబ్బులు స్వాహా చేయగా.. రూ.6కోట్లు వరకు పోలీసులు ఫ్రీజ్ చేశారు.

మోసపోయిన బాధితులు...

- కడపకు చెందిన ఓ ఉద్యోగి ఇన్వెస్ట్‌మెంటు యాప్ డౌన్‌లోడ్ చేసి.. రూ.20లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. లాభాల మాట దేవుడెరుగు.. తాను చెల్లించిన డబ్బు సైతం పోగొట్టుకున్నాడు. చేసేదిలేక పోలీసులను ఆశ్రయించారు.
- కడపకు చెందిన ఓ మహిళా ఉద్యోగి దాదాపు రూ.3లక్షలు ఇన్వెస్ట్‌మెంటులో పెట్టుబడులు పెట్టి పోగొట్టుకుంది.
- ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యాపారి, అలాగే అదే ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి పెట్టుబడులుగా లక్షల్లో పెట్టారు. అయితే వారు తమ డబ్బులు తీసుకునేందుకు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలి తం లేకపోవడంతో చివరికి పోలీసులను ఆశ్రయించారు.
- మైదుకూరు చెందిన పలువురు వ్యాపారులు ఓ వ్యక్తిని నమ్మి యాప్‌లలో లక్షల్లో పెట్టుబడు లు పెట్టారు. చివరికి ఎవరు స్పందించ కపోవ డంతో పెట్టుబడి పెట్టించిన వ్యక్తిపైనే వారు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అత్యాశ కుపోయి ఆన్‌లైన్ మోసాలకు బలి కావద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి... ఎస్పీ అశోక్‌కుమార్



సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు రకరకాల పద్ధతులు అనుసరిస్తున్నారు. మీరు పెట్టే పెట్టుబడికి రెట్టింపు లాభాలు వస్తాయంటూ టెలిగ్రాం, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టులు పెట్టి మోసగిస్తున్నారు. ఈజీమనీ కోసం ఆశపడితే లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దు. టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులకు ముందుగా ఇన్వెస్ట్ చేసి డబ్బు డబుల్ చేసుకోండి అంటూ లింకులు పంపుతారు. ఆ లింకులు ఓపెన్ చేసి వారు చెప్పినట్లు చేస్తే.. మొదట వెయ్యి, 2వేలకు డబుల్ లాభాలు వచ్చేలా చూపిస్తారు. ఇంకా ఎక్కువ పెడితే అధిక లాభాలు పొందుతారని నమ్మిస్తారు. ఆశపడి పెట్టుబడి పెట్టి మోసపోవద్దు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఎలాంటి అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దు. ఒకవేళ ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే సైబర్‌క్రైం సెల్ నెంబర్ 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి.

17న జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ప్రొద్దుటూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళల బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు 17వ తేదీ నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.క్రిష్ణమూర్తి, కార్యదర్శి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపా రు. సబ్ జూనియర్స్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2010 జనవరి 2 తర్వాత జన్మించి ఉండాలన్నారు. సబ్‌జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా చెవూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నా రు. జట్టు ఎంపికకు వచ్చే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, బ్లడ్‌గ్రూపు, డ్రస్‌కోడ్, షూ వేసుకుని రావాలని కోరా రు. వివరాలకు 9490181104 నెంబరులో సంప్రదించాలని కోరారు.

క్రిస్టియన్ వివాహాల నమోదుకు ముగ్గురు పాస్టర్ల నియామకం

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో క్రిస్టియన్ మతానికి చెందిన వివాహాలను నిర్వహించి.. అందుకు తగ్గ వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కోసం ముగ్గురు పాస్టర్లను అధీకృతులుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పది సంవత్సరాల పదవీ కాలంతో ఈ నియామకాలు చేపట్టారు. చట్టపరిధిలో ఆచారాల ప్రకారం మతపరమైన వివాహాలు నిర్వహించడానికి వీరికి అధికారం కల్పించారు. కడప రాజారెడ్డి వీధికి చెందిన భవనాసి సుధీర్‌ను రిడీమర్ చర్చికి, పులివెందుల నగరిగుట్టకు చెందిన కోట్లల్‌మ్యానియల్‌ను నగరిగుట్ట రాక్ ప్రేయర్ హౌస్ చర్చికి, పులివెందుల నగరిగుట్టకే చెందిన పాగల యేసయ్యను షలేమ్ ప్రేయర్ హౌస్ చర్చికి నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి.శ్రీధర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పబ్లిక్ హెల్త్ వర్కర్ల డిప్యుటేషన్ రద్దు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 8 మంది పబ్లిక్ హెల్త్‌వర్కర్లు డిప్యుటేషన్‌పై పబ్లిక్ హెల్త్ మేస్త్రీలుగా గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి 8 మంది వర్కర్ల డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు రేపటి నుంచి పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఆయా డివిజన్లలో స్వీపర్లుగా, డ్రైన్ క్లీనర్లుగా వెళ్లి పనులు చేయాలని అందులో పేర్కొన్నారు. డిప్యుటేషన్లు రద్దు అయిన మేస్త్రీలలో నాలుగు డివిజన్‌లకు చెందిన చైతన్య, మోషా, వినోద్, ప్రసాద్, సరస్వతి, ఎం.రమేష్, ఈ రమేష్, ఓబులేసు ఉన్నారు.

20 టీఎంసీలకు చేరిన గండికోట నీటిమట్టం



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. బుధవారం 20 టీఎంసీలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటి ని విడుదల చేస్తున్నామన్నారు. కాగా బుధవారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 13,900 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రాజెక్టులోకి 2700 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 11,200 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం పైడిపాలెం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని మైలవరం జలాశయ అధికారులు తెలిపారు. బుధవారం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి పది వేల క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాలువలకు నూరు క్యూసెక్కులు చొప్పున నీరు వదులుతున్నట్లు తెలిపారు. వర్షానికి మైలవరం జలాశయంలో ఇన్‌ఫ్లో ఇంకా పెరిగితే పెన్నానదికి వదిలే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుం జలాశయంలో 5.4 టీఎంసీల నీరు నిలువ ఉంది.

పరవళ్లు తొక్కుతున్న కుందూ నది



చాపాడు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

చాపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కుందూ నది పరవళ్లు తొక్కుతోంది. బుధవారం నదిలో సుమారు 20 అడుగుల లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయి. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నదిలోకి నీళ్లు భారీగా వచ్చి చేరుతున్నాయి. కుందూ నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో నదీ పరివాహక గ్రామాలలో వరి నాట్లు నాటుతున్నారు. అన్నవరం, నాగులపల్లె, ఖాదర్‌పల్లె, చాపాడు, సీతారామపురం, పెద్దగురవలూరు, తదితర గ్రామాల వద్ద కుందూ నది తీరం వెంబడి రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

విద్యా సంబంధిత అంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా సంబంధిత అంశాలపై సంపూర్ణ అవాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో జిల్లా స్థాయిలో హ్యూమన్ క్యాపిటల్ వికసిత్ భారత్‌లో భాగంగా స్కూలింగ్, బిల్డింగ్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో చర్చించిన విషయాలను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడుతూ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు విలువైన సలహాలు ఇస్తే రాష్ట్రస్థాయ అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఎంఈఓలను, ప్రధానోపాధ్యాయులను ఐదు గ్రూప్‌లుగా విభజించి చర్చించి వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యాశాఖలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సరస్వతి, జిల్లా వైద్యశాఖ నుంచి వైద్యాధికారి వెంకట చంద్రారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి



ఉమీర్ మృతదేహం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోత): మండలంలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్ సమీపంలో ఉన్న బావిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిందనూరు తాలూకా ఆర్ఎస్‌పోరు గ్రామానికి చెందిన ఉమీర్ (22) సిక్స్‌లైన్ రోడ్డుకు సంబంధించి రాడ్ బెండ్ హెల్పర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. బుధవారం వర్షం వస్తుండడంతో పని నిలిపి వేశారు. దీంతో ఉమీర్ సమీపంలోని బావి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అతనికి ఫిట్స్ రావడంతో బావిలో పడి మృతి చెందాడు. విష యాన్ని తోటి కార్మికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వేంపల్లె అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తీసుకెళ్లారు.

గుర్తుతెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన నజీర్ మృతదేహం

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జమ్మలమడుగు హైవేలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ నజీర్ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా... మౌలా అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... షేక్ నజీర్ ప్రొద్దుటూరు మండలం అమృతనగర్‌కు చెందిన లారీ మెకానిక్. కొలిమిగుండ్ల దగ్గర లారీ చెడిపోవడంతో మరమ్మత్తులు చేయడానికి మంగళవారం బైకుపై మౌలా అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. లారీ రిపేరు అనంతరం ప్రొద్దుటూరుకు బయలు దేరి వస్తుండగా అర్ధరాత్రి ప్రొద్దుటూరుకు సమీపంలోని బళ్లారి క్రిష్ణపట్నం హైవేపై వెనకాల గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నజీర్ పైకి టైర్లు ఎక్కి శరీరం నుజ్జు నుజ్జు అయింది. వెనక ఉన్న మౌలా గాయాలతో బయటపడ్డాడు. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ రెడ్డి తెలిపారు.

పెన్నానదిలో యువకుడు గల్లంతు

పెన్నానదిలో యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం





విక్రమ్ (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో గల పెన్నానదిలో మంగళవారం సాయంత్రం నాయుని విక్రమ్ (19) అనే యువకుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే .. రామేశ్వరం మిట్టమడికి చెందిన విక్రమ్, మత్తయ్య, వెంకటసాయి, శివలింగమయ్య నలుగురు స్నేహితులు. వీరంతా కలిసి పెన్నానది వద్దకు నదిలోనీళ్ల ప్రవాహం చూడటానికి వెళ్లారు. విక్రమ్‌కు చెందిన చెప్పు నీళ్లలో పడటంతో నదిలోకి దిగి గల్లంతయినట్లు తల్లి రుక్మిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి వెల్లడించారు. సమాచారం తెలిసి రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూటీంగా వెళ్లి మంగళవారం సాయంత్రం నుంచి పెన్నానదిలో విక్రమ్ ఆచూకి కోసం వెతికారు. నదిలో నీటిప్రవాహం ఉధృతంగా వుండటంతో బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదని పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కడప క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆటోనగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సిద్దవటం మండలం ఎగువపేటకు చెందిన వెంకటేశ్ (29) కడపలో ప్రైవేటు దుకాణంలో పని చేస్తున్నాడు. రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నడిరోడ్డుపై దిగబడిన లారీ

- వాహనదారులు, రైతులకు ఇబ్బందులు



చిన్నమండెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న రోడ్డుపై దిగబడి పోవడంతో రైతులు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లు తీసుకెళుతున్న లారీ మంగళ వారం రాత్రి దేవగుడిపల్లె, రౌతుకుంట రహదారి లో దిగబడి పోయింది. ఎక్స్‌కవేటర్ సాయంతో రాత్రంతా శ్రమించినా ఫలితం లేకపోవడంతో, బుధవారం మరో ఎక్స్‌కవేటర్‌ను రప్పించి లారీని బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటుగా వెళుతున్న వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధిక లోడుతో వెళ్లే లారీలు ఈ మార్గంలో ఎక్కు వగా వెళుతుండడంతో రోడ్డు ధ్వంసమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పొలాలకు వెళ్లే రహదారుల్లో భారీ లోడు వాహనాలు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నారు.

ఇళ్లలో చోరీకి పాల్పడే దొంగ అరెస్టు

- బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ప్రొద్దుటూరు రూరల్ సీఐ



దొంగ నుంచి రికవరీ చేసిన బంగారు ఆభరణాలు



దొంగను చూపిస్తున్న సీఐ మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ

రాజుపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం మండలం టంగుటూరులో ఇటీవల పట్టపగలు చోరీకి యత్నించి.. అడ్డుకున్న ఇంటి యజమానిపై దాడి చేసిన నిందితుడు మహ్మద్‌రఫిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, రాజుపాలెం ఎస్ఐ వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దువ్వూరు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మహ్మద్‌రఫి గతంలో జిల్లాలోని పలుచోరీ కేసుల్లో నిందితుడని.. కర్నూలు, వెలుగోడు, కొలింగుండ్ల, ఓర్వకల్లు, చాగలమర్రి, ఆళ్లగడ్డ తదితర పోలీసు స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయన్నారు. పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. ఈనెల 7న టంగుటూరు గ్రామంలో నంద్యాల వెంకటసుబ్బయ్య ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి చోరీకి యత్నించాడు. అదే సమయంలో వెంకటసుబ్బయ్య ఇంటిలోకి రావడంతో నిందితుడు ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారన్నారు. దాడిలో తీవ్రంగా గాయప డిన ఇంటి యజమాని కేకలు వేయడంతో రఫి పారిపోయారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామ న్నారు. బుధవారం గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడి వద్ద నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. మహ్మద్‌రఫిపై దొంగతనం కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐ వివరించారు.

వానొస్తే... భయం.... భయం

● కూలేందుకు సిద్ధంగా హోమియోపతి వైద్యశాల - ఆరోగ్య ఉపకేంద్రం

40 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు ● ఆరుబయటే వైద్య సేవలు



ఉపకేంద్రంలో ఆరుబయటే సేవలందిస్తున్న సిబ్బంది

ములకలచెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చాలు అటు హోమియోపతి వైద్యశాల, ఇటు ఆరోగ్య ఉపకేంద్రంలో సిబ్బంది గుండెలదిరి పోతుంటాయి. ఎప్పుడో 40 ఏళ్ల కిందట నిర్మించి న భవనాలు కావడంతో పెచ్చులూడి, భవనాలు మొత్తం ఉరుస్తున్నాయి. దీంతో ఆరుబయటే చెట్ల కింద రోగులకు వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి నెలకొంది. స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనాల్లో ప్రభుత్వాస్పత్రి నడిచేది. అయితే 15 ఏళ్ల కిందట కదిరి రోడ్డు సమీపంలోకి ప్రభుత్వాస్పత్రిని మార్చడంతో ఇక్కడ ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల, ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనాల పైకప్పు మొత్తం పెచ్చులూడి పోయాయి. భవనాలు దెబ్బతిని కూలిపోయే స్థితికి చేరాయి. దీంతో చిన్నపాటి వర్షాలకే భవనాలు ఉరుస్తున్నాయి. ఈ భవనాలు కూలిపోయే ప్రమాదం ఉండడంతో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆరుబయటే నిర్వహిస్తున్నారు. ప్రతి బుధవారం పిల్లలకు టీకాలు కూడా బయటే వేసి పంపుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ భవనాల గురించి పట్టించుకోకపోవడంతో మరింత దుస్థితికి చేరి కూలే స్థితికి చేరాయి. ములకల చెరువులో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి భవనాలు భారీగా ఉరుస్తున్నాయి. ఉన్నతాధికారులు తక్షణం చొరవ తీసుకుని పాత భవనాలు కూలిపోక ముందే కొత్త భవనాలు నిర్మించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



పెచ్చులూడిన హోమియోపతి వైద్యశాల పైకప్పు

కుంటను తలపిస్తున్న తారురోడ్డు

పెద్దమండ్యం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యంలో తారురోడ్డు నీటికుంటలను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మెయిన్ రోడ్డు, విద్యానగర్ కాలనీ, జండమాను ప్రాంతం జలమయమై కుంటలను తలపిస్తున్నాయి. గతంలో తారురోడ్డు మరమ్మతులు కూడా నాసిరకంగా జరగడంతో ఈ వర్షాలకు తారుకొట్టుకు పోయి గుంతల మయమయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో తారు రోడ్డు గుంతల్లో వర్షపు నీరు నిల్వలతో ప్రజలు పలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ వర్షాలు ఆగిన వెంటనే తారురోడ్డు మరమ్మతు కానీ సీసీ రోడ్డు వేయాలని ఆర్అండ్బీ అధికారులకు ప్రజలు కోరారు. తుపాన్ వర్షం ధాటికి పెద్దమండ్యం హైస్కూల్లో కూలీన ప్రహరీ వెంటనే నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. హైస్కూల్ మెయిన్ రోడ్డు పక్క నున్న ప్రహరీ నెమ్మెక్కి కుప్ప కూలింది. బాలికలు బాత్రూంలకు వెళ్లాలంటే రెండు రోజులుగా విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. అధికారులు చర్యలు తీసుకుని తాత్కాలిక పనులు, బాత్రూంలకు టార్పాలిన్ పట్టలు కట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హైస్కూల్ బాలికల బాత్రూం వద్ద కూలిన ప్రహరీ

రోడ్డెక్కిన మురుగు

కాల్వపై అక్రమ నిర్మాణం ● పట్టించుకోని అధికారులు ● సమస్యల వలయంలో ఇందిరానగర్

పీలేరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాల్వలో పారాల్సిన మురుగునీరు రోడ్డెక్కుతోంది. కాల్వలపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో మురుగు దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని కాలనీ వాసులు వాపోతున్నారు. చెత్తాచెదారం ఎక్కడి కక్కడ పేరుకు పోతుండడంతో మురుగునీరు పారకుంది. ఇటీవల కురుస్తున్న వర్షంతో కాల్వలో పారాల్సిన మురుగు రోడ్డెక్కుతుండడంతో జనం బయటకు రావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఇందిరానగర్లో మురుగు నీటి కాల్వలు, వీధులు ఆక్రమణకు గురైనా పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. మురుగు నీటి కాల్వలపై అక్రమ కట్టడాలు చోటు చేసుకోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇందిరానగర్, సుధాసుధీర్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో దశాబ్దాల కిందట నిర్మించిన మురుగు నీటి కాల్వలు ఛిద్రమయ్యాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్లలో నాణ్యత లేకపోవడంతో పలు చోట్ల సిమెంట్ లేచిపోయి గుంతలు పడ్డాయి. పట్టణంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న ఇందిరా నగర్లో తిష్టవేసిన సమస్యల పరిష్కారంపై ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



ఇందిరానగర్లో ప్రవహిస్తున్న మురుగునీరు

చర్యలు తీసుకుంటాం

ఇందిరానగర్లో మురుగు కాల్వల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుం టాం. మురుగు నీరు వీధుల్లోకి రాకుండా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పంపి చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని సత్వరం పరిష్కారిస్తాం. దెబ్బతిన్న మురుగు నీటి కాల్వలు మర్మతులు చేయాల్సి ఉంది.

లతీఫ్ఖాన్, ఇన్చార్జి ఈఓ, పీలేరు



రొచ్చుగా మారిన కదిరి రోడ్డుకు సమీప రోడ్డు

చినుకు పడితే....చిత్తడే

రొచ్చుగా మారిన ములకలచెరువు ● అడుగేయలేని దుస్థితి

ములకలచెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి ములకల చెరువు రొచ్చు... రొచ్చుగా మారిపోయింది. బురదమయమైన రోడ్లు, వీధుల్లో అడుగు ముందుకేయలేని పరిస్థితి నెలకొంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రోడ్డు మొదట్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరడంతో రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి సహా జూనియర్ కళాశాల, మోడల్ స్కూళ్లకు వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. బుధవారం కూడా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉండడంతో రోడ్డుపై చేరిన వర్షపు నీటితో రోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగం ఉన్న రోడ్డు, కదిరి రోడ్డు సమీప రోడ్డు, రాజీవ్ కాలనీ, త్యాగరాజు కాలనీ, నట్లగుట్ట తదితర రోడ్లు రొచ్చుగా మారాయి. మార్కెట్ యార్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం బురదమయం కావడంతో రైతులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు నడవలేక జారి పడుతున్నారు. స్థానిక రైల్వేగేటు వద్ద ముంబై - చెన్నై జాతీయ రహదారికి అనుకుని పెద్ద ఎత్తున వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దుగుసానివారిపల్లె, గుండాలవారిపల్లె, పాత ములకలచెరువు, పోకనాటివారిపల్లె, వడ్డిపల్లె తదితర గ్రామాల రోడ్లు బురదమయమన్నాయి.

రీసర్వేని వేగంగా చేపట్టండి



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

కురబలకోట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే త్వరగా చేపట్టాలని మద నపల్లె సబ్కలెక్టర్ చల్లా కల్యాణి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతూ మండల పరిధిలో తప్పులు తలెత్తకుండా రీ సర్వేని త్వరగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం, గ్రామాల్లో పర్యటించి సమస్యలను పూర్తి చేయాలన్నారు. అనంతరం కురబలకోట కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. కె.ధనంజయులు, ఆర్ఐ శేషాద్రి, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించండి

బి.కొత్తకోట, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, రీసర్వే సమస్యలపై తక్షణం స్పందించాలని సబ్కలెక్టర్ కల్యాణి ఆదేశించారు. బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో ఆమె రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తూ మండల భౌగోళిక స్థితిగతులు, ప్రధాన సమస్యలు, హార్సిలీహిల్స్ గురించి తహసీల్దార్ బావాజాన్ను అడిగి తెలుసుకున్నారు. డీటీ బాలాజీ, ఆర్ఐ వీరాంజనేయులు వీఆర్వోలు, సర్వేయర్ పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



మేళ్ల చెరువులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పీలేరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్లో సాగు చేసి పంటలన్నింటికీ విధిగా ఈ పంట నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచించారు. బుధవారం తలపుల, మేళ్లచెరువు పంచాయతీల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిపొందే రైతులు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని తెలిపారు. టెక్నాలజీకి అనుగుణంగా రైతులు డ్రోన్ల టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. పంట సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా అవసరమైన ఎరువులు సరైన మోతాదులో వాడాలని చెప్పారు. తలపుల, మేళ్లచెరువు రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. శ్రీఅన్నమయ్య రైతు సహకార సంఘంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మేళ్లచెరువులో వేరుశనగ పొలాన్ని సందర్శించి పొలం పిలుస్తోందిలో పాల్గొన్నారు. పీలేరు ఏడీఏ వై.వీ. రమణరావు, ఏఓ రమాదేవి, నవంత్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

పీలేరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 'మన ఇల్లు మన గౌరవం'లో భాగంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి క్రిష్ణకిషోర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణంపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మండలంలో 377 ఇళ్లు మోల్డింగ్కు సిద్ధంగా ఉన్నాయని, మరో 2173 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులతో సంప్రదించి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. రోజూ నిర్మాణ వివరాలు తెలియజేయాలని సూచించారు. ఎంపీడీఓ శివశంకర్, హౌసింగ్ ఇన్చార్జి డీఈ రమణయ్య, హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే మలేరియా నివారణ



చేప పిల్లలు వదులుతున్న వైద్య సిబ్బంది

పీలేరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దోమల నియంత్రణతోనే మలేరియాను నియంత్రించవచ్చని పీలేరు సబ్-యూనిట్ మలేరియా నివారణ అధికారి విద్యాసాగర్ అన్నారు. దోమల సంతతి నివారణలో భాగంగా రేగళ్లు పీహెచ్సీ పరిధిలోని అగ్రహారం, దొడ్డిపల్లె, తుమ్మలవారిపల్లె, కొత్తపల్లె చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను వదిలిన ఆయన మాట్లాడుతూ చెరువుల్లోని దోమల గుడ్లు, లార్వాలను ఆహారంగా తీసుకునే గంబూషియా చేపల కారణంగా దోమల సంతతి గణనీయంగా తగ్గుతుందన్నారు. రేగళ్లు పీహెచ్సీ వైద్యాధికారి రాధామాధవి, పీలేరు మత్స్యశాఖ అధికారి మోహనకృష్ణ, కలికిరి సబ్-యూనిట్ అధికారి ముజీబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్అదాలత్ విజయవంతం చేద్దాం



పోలీసులు, న్యాయవాదులతో సమీక్షిస్తున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్ను విజయవంతం చేయాలని జడ్జి గురుఅరవింద్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు చట్టం, న్యాయాల పట్ల అవగాహన కల్పిస్తూ లోక్అదాలత్లో కేసులు పరిష్కరించుకునేలా చూడాలన్నారు. అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, న్యాయవాదులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రకాష్, సెక్రటరీ ఆర్వీ ప్రసాద్, సీఐలు రాఘవరెడ్డి, అనీల్కుమార్, లక్ష్మన్న, ఎస్ఐలు చంద్రశేఖర్, రఘురామ్, లోకేష్, న్యాయవాదులు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేవళంపేట వీధికి సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆమోదం లభించింది. 11వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కనీస సౌకర్యాలు కల్పించాలి' అన్న కథనంపై అధికారులు స్పందించారు. బుధవారం దేవళంపేట వీధికి చేరుకుని సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం లభించిందని కొలతలను సేకరించారు.

మోడల్ స్కూల్ తనిఖీ

బి.కొత్తకోట,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఉన్న మోడల్స్కూల్ను ఎంపీడీఓ క్రిష్ణవేణి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, భద్రత, సరైన ఆహారం, బాలికల వ్యక్తిగత అవసరాల గురించి ఆరా తీశారు. ఇంటర్ బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్ సరఫరా, వాటిని బర్న్ చేసే సదుపాయంపై బాలికలు ఫిర్యాదు చేయడంతో అందుబాటులో వున్న ఓ ఇన్సినేటర్ను మోడల్స్కూల్ యాజమాన్యానికి సమకూర్చారు. బాలికలు విద్యతో పాటు, అన్ని విధాలా సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాఠశాల సిబ్బంది, మండల అధికారులకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డిశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్నాయక్, వార్డెన్ లక్ష్మి, హౌసింగ్ ఏఈ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'మీకు తెలుసా' సైకిల్ ర్యాలీ

వాల్మీకిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఆర్ఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పట్టణంలో మీకు తెలుసా కార్యక్రమంపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్, సంస్థ ప్రతినిధులు పురుషోత్తం, శ్వేత, శ్రీలక్ష్మి, హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ను సన్మానించిన సింగిల్ విండో ఛైర్మన్

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జంగం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ను పలువురు సన్మానించి అభినందించారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో ఛైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఆయనను సత్కరించారు. చంద్రకుమార్ రెడ్డి, మాజీ కలికిరి సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, గుట్టపాలెం మాజీ సర్పంచు కేవీ రెడ్డి, పత్తేగడ ఎంపీటీసీ కృష్ణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస వర్మ, విండో సీఈఓ కొండప్ప, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్డీఓ

తంబళ్లపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎల్డీఓ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్నాథరెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలో ముమ్మరంగా పర్యటించిన ఆయన గోపిదిన్నె సచివాలయాన్ని తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. శాఖల వారీ ఉద్యోగుల పనితీరుపై ఆరాతీశారు. గోపిదిన్నె హరిజనవాడ, ఉప్పులూరివాండ్ల పల్లె హౌసింగ్ లే అవుట్ను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. తదనంతరం కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పరిసరాలు, మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ థామస్రాజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హిమబిందు, టీడీపీ వార్డు సభ్యుడుజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మదనపల్లె టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో కాలుష్య నివారణకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని పలు గ్రామాలు తిరిగి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామాల్లో విచ్చలవిడిగా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కంపోస్టుయార్డుకు తరలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్, అధ్యాపకుడు దర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు 'లులు'కు కట్టబెట్టడం తగదు


ఎన్ఎంయూ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆనంద్



డిపో కార్యాలయం వద్ద ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పీలేరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల విలువైన గవర్నర్పేట రెండు డిపోలను 'లులు'కంపెనీకి ఇవ్వడం ప్రభుత్వానికి తగదని ఎన్ఎంయూ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆనంద్ తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రెండో రోజు పీలేరు ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ 4.15 ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని కారు చౌకగా 'లులు' కంపెనీకి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. 'లులు'కు ఇచ్చిన ఆస్తులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రమోషన్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీ.వీ. రమణ, జీ. ఆదినారాయణ, రీజనల్ నేతలు వీ.పీ. నాయుడు, టీ. మధుసూదన్, డిపో ఛైర్మన్ ఏ. ఆర్. చంద్ర, ట్రెజరర్ కే. రఘు, వర్కింగ్ ప్రెసిడెంట్ కే. హరినాథ్, బీ. శివశంకర్, చాంద్ బాషా, కే.ఎస్. రామయ్య, పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ చొరవతో బాగుపడిన రోడ్డు



రోడ్డును బాగు చేయిస్తున్న రహంతుల్లా

పీలేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఏఎంసీ డైరెక్టర్ పఠాన్ రహంతుల్లా చొరవతో మురికి కూపంలో ఉన్న ఓ రోడ్డు బాగుపడింది. పట్టణ శివార్లలోని మోడల్ కాలనీ నుంచి నాగిరెడ్డి కాలనీ, తిరుపతి రోడ్డుకు సరైన దారి లేక కాలనీ వాసులు ఇబ్బంది పడేవారు. ఉన్న రోడ్డు సరైన నిర్వహణ లేక మురికి కూపంలా తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అది మరింత దారుణంగా తయారైంది. సమస్యను గుర్తించిన ఏఎంసీ డైరెక్టర్ రహంతుల్లా ఆ రోడ్డును బాగు చేయడానికి బుధవారం ఉదయం నడుం బిగించారు. సొంత నిధులతో ఎక్స్కవేటర్తో ఐదు గంటలు శ్రమించి రోడ్డును బాగుచేయించారు. దీంతో ఆ దారి పాదచారులు, వాహనదారుల రాకపోకలకు అనువుగా మారింది. రహంతుల్లా చొరవను మోడల్ కాలనీ వాసులు అభినందించారు.

చౌకదుకాణం ఆకస్మిక తనిఖీ



రేషన్దుకాణం తనిఖీ చేస్తున్న జేసీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌకదుకాణాన్ని సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని సిబ్బంది ద్వారా ఆయన వివిధ విషయాలను అడిగి తెలుసుకున్నారు. చౌకదుకాణం నెంబరు 1081033ని సందర్శించి అక్కడ దుకాణం తెరిసే సమయం, మూసే సమయం పంపిణీ వస్తువుల, స్టాక్పై ఆరా తీశారు. ఇందులో సీఎస్డీటీ ఫిరోజ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న కృష్ణాష్టమి వేడుకలు

పీలేరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పీలేరు ఏఎంసీ ఆవరణలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ సంఘ సభ్యుడు రాజేశ్ యాదవ్ పేర్కొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు, ఉట్టి కొట్టడం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

'వాస్తవాలు తెలుసుకోవాలి'

గుర్రంకొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు అన్నారు. బుధవారం గుర్రంకొండలో బీజేపీ నేతలతో కలిసి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిజాయతీగా పని చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలే అందుకు నిదర్శనమన్నారు. రాహుల్గాంధీ నిజాలను తెలుసుకోకుండా మాట్లాడడం తగదన్నారు. బీజేపీ నేతలు శ్రీనివాస్, భరత్, గోపాల్రెడ్డి ఉన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తుకు ముప్పు

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను వినియోగిస్తే యువత భవిష్యత్తుకు ముప్పు తప్పదని కలికిరి ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ప్రధానంగా విద్యార్థులు అన్ని రకాల చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా వుండాలన్నారు. స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. సమావేశంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం సీఐగా రాఘవరెడ్డి



వాల్మీకిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం సీఐగా బి. రాఘవరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ప్రసాద్బాబు రాజంపేట మండలం మన్నూరు సర్కిల్కు బదిలీ కాగా ఆయన స్థానంలో జిల్లా కేంద్రం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో శాంతి భద్రతల విషయమై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, అక్రమ రవాణాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో పేకాట, కోడి పందేలు, జూద కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం సర్కిల్ పరిధి ఎస్ఐలు, సిబ్బందితో సమావేశమయ్యారు.